# నిజామాబాద్ సెంటర్ 37వ వార్షికోత్సవం

**2009 డిశెంబరు 5,6 తేదీలలో...**

నిజామాబాద్ సెంటర్ 37వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా డిశెంబరు 5,6 తేదీలలో ప్రేమిక సహవాస్ ఏర్పాటుచేసినట్లు శ్రీ ఏ. జనార్ధనరావు ( 9908785774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరారు. బాబా సెంటర్లనుండి పాల్గొనువారు ఎందరు స్త్రీలు,పురుషులు హాజరవుతున్నారో విడివిడిగా రాసి 31. 10. 2009లోగా తగిన ఏర్పాట్లు చేపట్టడానికై ఆ వివరాలు పంపవల్సిందిగా కోరారు. డిశంబరు 4 సాయంత్రం నుండి డిశంబరు 6. రాత్రి 8 గంటలదాకా భోజన వసతి సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటుచేశామని స్థానిక బాబా సెంటర్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు నిజామాబాద్ బాబా సెంటర్, ఎల్లమ్మ గుట్ట, నిజామాబాద్ – 503 001. ఫోన్. 99087 85774 సంప్రదించగలరు.

---

# విశ్వప్రేమ ఉత్సవం - హమీర్‌పూర్‌లో

**2009 నవంబర్ 17,18,19 తేదీలలో**

అవతార్ మెహెర్‌బాబా హమీర్‌పూర్ నందు ఇచ్చిన ప్రధమ పావన దర్శన జ్ఞాపకాల విశ్వప్రేమ ఉత్సవం మెహెర్‌పురి - హమీర్‌పూర్‌లో 2009 నవంబర్ 17,18,19 తేదీలలో ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు ఒక ఆహ్వానం తెలిపారు. కాగా, అవతార్ ధామ్– ఇంగోటా, (20 నవంబర్ 2009), మెహెర్‌వాన్‌ధామ్– మౌదహా (21 నవంబర్ 2009), మెహెర్ ఆస్థానా – (మహేవా) (22, 23 నవంబర్ 2009), మెహెర్‌థామ్ – నౌరంగా (25,26 నవంబర్ 2009)లలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/ RNP/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి : 8 సంచిక: 05 హైదరాబాద్ 2009 సెప్టెంబరు పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# హరిద్వార్ నుంచి పాదయాత్ర

**2009 అక్టోబర్ 13, 14 తేదీలలో**

అవతారుని నవజీవన యాత్ర ముగిసి 60 వసంతాలు నిండిన సందర్భంగా 2009 అక్టోబర్ 13, 14 తేదీలలో రెండ్రోజులపాటు హరిద్వార్ నుంచి డెహ్రాడూన్ వరకు సుమారు 60 కి.మీ. పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బాబా ప్రేమికులు డా॥ ఎస్.నరేంద్ర ప్రసాద్, హైదరాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నవజీవనంలో మెహెరుడు నివసించిన మెహెర్‌మాఫీ ప్రాంగణంలో చక్కని భవన నిర్మాణం చేపట్టి అక్టోబర్ 16 నాటికి ఒక దశాబ్ది నిండుతుంది. ఈ సందర్భాన్ని కూడా పురస్కరించుకుని అక్టోబర్ 15, 16 తేదీలలో, మెహెర్‌మాఫీలో రెండ్రోజుల ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసామని ఆయన తెలిపారు. ఆసక్తిగల ఆరోగ్యవంతులైన బాబా ప్రేమికులందరూ ఈ నాలుగురోజుల మహత్తర కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేసారు. మరిన్ని వివరాలకై Sri S.R. Sharma, Secretary, AMB New Life Trust, 1147, New Colony, Ballupur, DEHRA DUN - 248 001, Ph: 0135-2628206, 09897912907, email: srsharma46@gmail.com. ఆసక్తిగలవారు రూ. 100/- ముందస్తు ఖర్చుల నిమిత్తం పంపవలసిందిగానూ, తమ ప్రయాణ వివరాలు త్వరలో పంపవలెనని నిర్వాహకులు కోరుతున్నారు.

# మిర్యాలగూడాలో

**అక్టోబర్ 6 -7 తేదీలలో**

అవతార్ మెహెర్‌బాబా ప్రేమిక సహవాస్ - మిర్యాలగూడాలో అక్టోబర్ 6 మరియు 7వ తేదీలలో ఏర్పాటుచేసినట్లు శ్రీ గోపగాని నర్సయ్య తెలిపారు. ఈ సహవాస్‌లో ప్రత్యేకంగా - బాబాతో సహవాస్ భాగ్యం పొందినవారు తప్పక హజరుకావలివల్సిందిగా శ్రీ గోపగాని కోరారు. 6-10-2009 ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ "చెన్నై శ్రీను బాబా మ్యూజిక్ స్కూల్ , మద్రాస్ , కేశవరావు గారు, నర్సరావుపేట, అవతార్ మెహెర్‌బాబా సెంటర్ కోఠి, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో - **ఏకాహం** నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం - 92468 66768, 94403 58231, 08682 - 227648 సంప్రదించగలరు. మెహెరామాయి చిత్రపటాన్ని 7-10-2009 అవిష్కరించనున్నామని శ్రీ గోపగాని అన్నారు.





## బాబా సందేశం



**As long as you hold fast to me, you are priceless.**

**నన్ను నమ్మినవారి జీవితాలు - అమూల్యం**

- మెహెర్‌బాబా

## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. ఎ.వి.రాఘువులు 6-15
3. 1954 సెప్టెంబరు 12, 16-17
4. జూబ్లీ సహవాస్ 18-19
4. లార్డ్‌మెహెర్ 20-25
5 బాబా ప్రేమ అందరి సొత్తు 26-27
6. ప్రార్ధనలు - పూజలు 28-29
7. మా మాటలు 30-33
8. శ్రీమతి బేల 34-35
9. బాటసారులు 36-37
10. సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్వీట్యూడ్ 38
11. జీవిత సభ్యులు 39



గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


**మనవి**

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# పగడదిన్నె దశమ వార్షికోత్సవం

### అక్టోబర్ 24,25 తేదీలలో

అవతార్ మెహెర్‌బాబా ఆధ్యాత్మిక కేంద్రం పగడదిన్నె క్యాంపు, సింధనూరు తాలూకా రాయచూరు జిల్లా కర్నాటక రాష్ట్రంలో అక్టోబర్ 24,25 తేదీలలో, శని,ఆదివారాలలో దశమ వార్షికోత్సవం, ప్రేమిక సహవాస్ జరుపుతున్నట్లు స్థానిక సెంటర్ కన్వీనరు శ్రీ వల్లూరి గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలకోసం వల్లూరి గాంధీ (09379075070) పగడదిన్నె క్యాంపు, లేదా ఫోన్ నెంబర్లు - 09902131172, 09845064723 సంప్రదించగలరు. హైదరాబాద్ నుండి సింధనూరుకు (300 కి.మీ.) అనేక ఆర్.టి.సి. బస్సులు వున్నాయి.. ఆంధ్ర ప్రాంతం వారికి అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో బళ్ళారి రైల్వే స్టేషన్ చేరి బళ్లారి నుండి సింధనూరుకు బస్సు (100 కిమీ)లో చేరుకోగలరు.

# పెరికీడు సెంటరు

### తృతీయ వార్షికోత్సవం - అక్టోబరు 2న

పెరికీడు బాబా సెంటరు తృతీయ వార్షికోత్సవం అక్టోబరు 2న ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటలవరకూ నిర్వహిస్తున్నట్లు శ్రీ రెడ్డి సింహాచలం (92473 -45647., 08656- 243193) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ కె.హెచ్.కె. ప్రసాద్, శ్రీమతి శారద, శ్రీ ప్రసాద్ రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# విజయనగరం సెంటర్‌లో సహవాస్

## 2009 అక్టోబరు 25న

2009 అక్టోబరు 25న వివిజయనగరం బాబా సెంటర్‌లో సహవాస్ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి 2 గంటలదాకా నిర్వహిస్తున్నట్లు శ్రీ కొల్లి రామారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి మాధవీలత, విశాఖపట్నం, శ్రీ ఆనంద కుమార్, శ్రీకాకుళం, ముఖ్య వక్తలుగా హాజరవుతున్నట్లు శ్రీ రామారావ్ తెలిపారు. శ్రీ బాణేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. వీలున్న బాబా ప్రేమికులు తప్పక ఈ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరారు.





సంపాదకీయం

# ప్రేమిక సహవాస్‌లు

**ఇ**కపై రాబోయే మూడు నాలుగు నెలలలో రాష్ట్రంలో ఎలాలేదన్నా రెండుమూడుచోట్ల ప్రతినెలా ఒకటి రెండు బాబా ప్రేమిక సహవాస్‌లు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడాలో, నిజామాబాద్‌లో, కృష్ణాజిల్లాలోని పెరికేడులో, విజయనగరం, పావగడ, పగడదిన్నె, ఇలా పలుసెంటర్లు భారీ ఏర్పాట్లుతో పెద్ద ఎత్తున సహవాస్ కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అంతేకాదు, డెహ్రాడూన్ సెంటర్‌వారు హరిద్వార్ నుండి పాదయాత్ర, అనంతరం ప్రేమిక సమ్మేళనం ఏర్పాటుచేశారు. నవంబరు నెలలో ప్రతి ఏడాది మాదిరిగా ఉత్తర ప్రదేశ్‌లోని హమీపూర్‌లో విశ్వ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. హమీర్‌పూర్‌కు వెళ్ళాలని ఇప్పటినుండే మనవారు రైలు రిజర్వేషన్‌లాంటి ప్రయత్నాలు చాలామంది చేసుకుంటున్నారు. 2009 డిశంబరు దాకా ఇలా రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో బాబా సహవాస్ కార్యక్రమాల ఏర్పాటు జరిగింది. 2010 జనవరిలో అవతారుని అమరతిథి, ఫిబ్రవరిలో జన్మదినోత్సవ వేడుకలు ప్రతిప్రాంతంలో వుంటాయి కనుక, 2010 మార్చి, ఏప్రిల్ తర్వాతనే క్రొత్త సంవత్సరంలో ప్రత్యేక సహవాస్ కార్యక్రమాల ఏర్పాటుకు వీలుదొరుకుతుంది.

నిశితంగా గమనిస్తే, ప్రతి సహవాస్ నిర్వహణ కోసం సంబంధిత నిర్వాహకులు కనీసం మూడునాలుగు నెలలు శ్రమిస్తారు. ఎంతో ప్లానింగు , మరెంతో వ్యయప్రయాసలతో కూడినది -ప్రేమిక సహవాస్ ఏర్పాటనేది. ఇదేమీ ఆషామాషీ విషయం కాదు.

అయితే ఒక్కమాట. ఇంత పెద్ద ఎత్తున చేపట్టే సహవాస్ కార్యక్రమాల్లో పేదవారికి, నిస్సహాయుల్ని ఆదుకునే సహాయక, సేవా కార్యక్రమాలు గురించి నిర్వాహకులు చాలామంది దృష్టిసారించడం లేదని మా అభిప్రాయం. ఒక అడపిల్ల పెళ్ళిని తలపించే స్థాయిలో బాబా సహవాస్ కార్యక్రమాలు చేపడుతున్నారని మా అభిప్రాయం. అందులో ఎలాంటి తప్పు లేదు. తప్పు పట్టేవారూ బహుశా వుండకపోవచ్చు. మన సాంప్రదాయం, మన మర్యాదల తీరు అది. ఎటొచ్చీ, మా విన్నపం ఏమంటే, కడు పేదవారు, అన్నార్తులు ఇంకా ప్రతి ప్రాంతంలో ఎందరో వున్నారు. అందర్నీ కాకపోయినా, ఎంపిక చేసిన నలుగురైదుగురికి తగిన సహాయం అందించే ప్రయత్నం చేస్తే, అది మెహెర్‌బాబాకు ఎంతో ప్రీతి, మక్కువ. వాడియా పార్కులో ఏర్పాటుచేసిన ప్రజా దర్శనంలో కూడా, బాబా ఏడుగురి పేదలకు దైవ దక్షిణ ఇచ్చిన పిదపనే తన దివ్య ప్రజాదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో ప్రేమిక సహవాస్‌లు ఏర్పాటుచేయబోయే నిర్వాహకులు ఈ విషయంపై దృష్టిసారించాలని మనవి. పాఠకులు సయితం ఈ అంశంపై స్పందించితే, మెహెర్‌బాబా మాస పత్రిక వారి అమూల్య ఆలోచనలు పలువురి సౌలభ్యం కోసం తప్పక ప్రచురిస్తుంది.

# ఎ.వి.రాఘవులు



**అవతార్ మెహెర్‌బాబా ప్రథమ ఆంధ్రా పర్యటనలో జరిగిన అనేక వాస్తవ విషయాలకు నిలువెత్తు సాక్ష్యం శ్రీ ఎ.వి.రాఘవులు, విజయవాడ. శ్రీ రాఘవులు అవతార్ మెహెర్‌బాబా, ఆంధ్రా సెంటర్‌కు కార్యదర్శిగా మూడు దశాబ్దాలకు పైగా ఉన్నారు. 1953లో మెహెర్‌బాబా తొలి ఆంధ్రా పర్యటన నుంచి అవతారునితో అనుబంధం ఆయనకు ఉంది. అవతారుని సాన్నిధ్యంలో ఎన్నో అద్భుతాలు ఆయన అనుభవించారు. ఎన్నో విషయాలు- విశేషాలు ఆయన చవిచూశారు. అదొక మహత్తర అదృష్టం. అలా లభించిన అవకాశం ఆయన సొంతం అనొచ్చు. అయితే, అలనాటి ఆ విశేషాలను, అనుభవాలను ఆ వివరాలన్నింటినీ, ఇకపై ఆయన మాటల్లోనే ఆలకిద్దాం.**

మెహెర్‌బాబా ఆంధ్రరాష్ట్ర పర్యటనా విశేషాలు గురించి ప్రస్తావించే ముందు, ముందుగా మెహెర్‌బాబా తన మండలి సభ్యులలో ఒకరైన సో॥ ఏరుచ్ ద్వారా తన పర్యటనా విషయాలను సూచిస్తూ 8.12.1952 వ్రాసిన లేఖ గురించి గుర్తుచేసుకుందాం. సో॥ఏరుచ్ తన లేఖను- బాబా ప్రేమికులు- శ్రీ వై. రంగారావు- ఏలూరుకు వ్రాశారు.

ఆంధ్రులు- ముఖ్యంగా తెలుగువారు అవతారుని తొలి పర్యటనలో పాలుపంచుకునే వారు, మెహెర్‌బాబా యొక్క ప్రేమాశీస్సులు- ఆయన లీలలు- అనుభూతులు విశేషంగా లభించడమే కాకుండా- హమీర్‌పూర్ జిల్లాలోని స్థానిక ప్రజానీకానికి ఆయన అందించిన ప్రేమాశీస్సులు కంటే, తెలుగువారికి మెహెర్‌బాబా తన పర్యటనలో సుమారు ఇరవై రెట్లు పైగా తన ప్రేమాశీస్సులు అందించనున్నారని బాబా సూచించినట్లు ఏరుచ్ తన లేఖలో వ్రాశారు.

మెహెర్‌బాబా తాను వ్రాయించిన లేఖలో సూచించినట్లు, ఏలూరులో ఆయన విడిది చేసిన రోజులు అంటే 1953 జనవరి 23 నుంచి 29 తేదీలలో, ఆయన సమక్షంలో,





ఆయనతో స్వయంగా ఉండి, ఆ ప్రేమను పొందినవారు నిజంగా ధన్యులు. ఆనాటి వివరాలు- విశేషాలు అక్షర రూపంలో వర్ణించడం అలవికాని విషయం. మానవ మేధకు వీలుకాదు. కీ॥శే॥ వై.రంగారావు- ఆనాటి ఏలూరు- మెహెర్‌బాబా సెంటర్‌కు కార్యదర్శిగా ఉండేవారు. ఆయనతో పాటు కొంతమంది మిత్రులు- బాబా ప్రేమికులతో కలిసి, మెహెర్‌బాబాను ఏలూరు పర్యటనకై ఆహ్వానించారు. మెహెర్‌బాబా ఏలూరులో పర్యటించేందుకు ప్రధానకారకులు శ్రీ రంగారావు అనే చెప్పాలి. ఆ రోజుల్లో ఏలూరులో మెహెర్‌బాబా సెంటర్ స్థానిక జిల్లా జడ్జి గారి కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్న శ్రీ కలువాలిపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఇంట్లో ఉండేది. ఏలూరుకు విచ్చేస్తున్న మెహెర్‌బాబాకు, ఆయన మండలి సభ్యులకు కట్టా సుబ్బారావు తగిన ఆతిథ్యం ఇచ్చారు. కట్టా సుబ్బారావుగారికి ఊరి పొలిమేరల్లో మామిడితోట, ఆ తోటలో చిన్న విశ్రాంతి భవనం ఉన్నాయి. ఆ భవనాలను మెహెర్‌బాబాకు కేటాయించారు. తోట లోపల టెంట్‌లు వేసి, మండలి వారికి తగిన బస ఏర్పాటు చేశారు.

ఆనాడు- ఏలూరులో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసరు (ఏసిటివో)గా పనిచేస్తున్న శ్రీ చలపతిరావు- శ్రీ రంగారావుకు చేదోడు- వాదోడుగా ఉండి అన్నివిధాల తగిన ఏర్పాట్లు చేయడంలో తనవంతుగా సహకరించారు. శ్రీ ఆర్.వి.రామారావు నాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పన్జేస్తుండేవారు. ఆయనేమో- ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు.

అలాగే, కట్టా సుబ్బారావు గారికి, ఆయనకి అత్యంత దగ్గరి స్నేహితుడు శ్రీ కంబం మెట్టు నారాయణరావు అడ్వకేటు- శ్రీ కట్టా వారికి తగిన సహాయం అందిస్తూ, మెహెర్‌బాబాకు ఆయన మండలి వారందరికీ వేళకు తగిన కాఫీ, టీ, భోజన ఏర్పాట్లు చేసే బాధ్యత చేపట్టారు. మిగిలినవారు అనేకమంది శ్రీ రంగారావుకు అనేక విధాలుగా కార్యక్రమం విజయవంతం కావడానికి సహాయం అందించారు.

1953 జనవరి 23 సాయంత్రం మెహెర్‌బాబా తొలిసారిగా కట్టా సుబ్బారావుగారి మామిడితోటలో కాలుపెట్టారు. ఆయన పాద స్పర్శతో - ఆ ప్రాంతమంతా ఒక స్వర్గధామంగా మారిందంటే అతిశయోక్తికాదు.

## స్వగతం

నేను- నాతోపాటు కలకత్తా, సత్రగాచ్చి, ఖరగ్‌పూర్, భిలాస్‌పూర్, టాటానగర్‌లలో ఉంటున్న కొంతమంది తెలుగువాళ్ళం మెహెర్‌బాబా దర్శనార్థం ఏలూరుకు చేరుకున్నాం. మా అందరికీ సో॥ రంగారావు- ముందుగా మెహెర్‌బాబా పర్యటనా వివరాలు తెలియజేస్తూ, మెహెరుని దర్శనం కోసం తప్పక రమ్మనమని, ఆ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఆ రకంగా మెహెర్‌బాబా ఏలూరులో బసచేసినన్ని రోజులూ- మేం



కూడా ఆయనతో పాటు ఉండే అవకాశం – అదృష్టం కలిగాయి. అలాగే, విజయవాడ నుంచి సో॥ మాణిక్యాలరావు– ఆయన కుటుంబసభ్యులు బాబా దర్శనం కోసం ఏలూరుకు వచ్చారు. ఖిలాస్‌పూర్ నుంచి సో॥వాడ్రేవు రామారావు వచ్చారు. వీరందరూ కూడా ఏలూరులో ఉన్న మా ఇంట్లో బసచేశారు.

1953– జనవరి 24, అంటే బాబా ఏలూరు వచ్చిన మర్నాడు ఉదయం. టీ త్రాగడం ముగిశాక, కట్టా సుబ్బారావుగారి మామిడితోటలోనే ఏడుగురు పేదల పాదాలు కడిగి ఒక్కొక్కనికి 51 రూపాయల చొప్పున దక్షిణ ఇచ్చారు. ఆ తర్వాత రంగారావుగారి రెండవ కుమారుడు చి॥ భూపతిరావు పాదాలు కడిగి – ఏడు రూపాయలు ప్రసాదంగా బాబా ఇచ్చారు.

ఆ తర్వాత పెద్ద ఎత్తున బహిరంగ దర్శన కార్యక్రమం– బాబా మామిడితోటలో ఇచ్చారు. స్థానిక పెద్దలు– అధికారులు– అనధికారులు– విశేషంగా మెహెర్‌బాబాను దర్శించుకున్నారు. ఆ తర్వాత రెండవ బహిరంగ దర్శన కార్యక్రమం ఏలూరులోని రామకోటి భక్త సమాజం వారి పందిళ్ళలో ఏర్పాటు చేయగా, సుమారు 60 వేల మంది మెహెర్‌బాబాను దర్శించుకున్నారు. రామకోటి సమాజంలో మాత్రమే బహిరంగ దర్శనం కార్యక్రమం ఏర్పాటుకు శ్రీ రంగారావుకు సో॥ ఏరుచ్ తన లేఖ ద్వారా అనుమతి ఇచ్చారు. అయితే, ఏలూరుకు చుట్టుప్రక్కల గల మూడు గ్రామాలలో కూడా బాబా దర్శన కార్యక్రమాల ఏర్పాటు జరిగింది.

మామిడితోటలో బాబా బసచేసిన విశ్రాంతి భవనం ఎదురుగా పలువురు ప్రేమికులు బాబా దర్శనం చేసుకునేందుకు వీలుగా పెద్ద చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం – సాయంత్రం పూట– బాబా దర్శనం ఇచ్చేవారు. ఆనాటి రోజుల్లో 'సహవాస్' అనే పదం విశేషంగా వాడుకలో లేకున్నా, సాక్షాత్తూ మెహెరుని సన్నిధిలోనే జరిగిన పెద్ద సహవాస్‌గా పేర్కొనొచ్చు. మెహెర్‌బాబా ఎదుట భజనలు, పాటలు పాడటం బాబా ప్రేమికులు చేశారు. సో॥ కృష్ణరాజు గారి అక్కచెల్లెళ్ళు– బాబా ఎదుట 'రాధకృష్ణ' నృత్యం చేశారు. మధ్య మధ్యలో బాబా– తన సందేశం ఇచ్చారు.

ఏలూరులో మెహెర్‌బాబా అనేకమంది ప్రేమికుల ఇళ్ళను సందర్శించారు. బాబాకు ప్రతి వారి ఇంటికీ వెళ్ళడం సుతరామం ఇష్టంగా లేదు. ప్రతిరోజూ మీరందరూ నాతో ఉంటున్నారు. నన్ను చూడ్డానికి వస్తున్నారు. నా దర్శనం ప్రతిరోజూ చేసుకుంటున్నారు





ఇంకా మీ ఇళ్ళకు రావాల్సిన పనేముందని బాబా తరచు హెచ్చరించేవారు. అయితే ప్రారంభంలో కేవలం 19 మంది ఇళ్ళు మాత్రమే ఉన్నాయని నాతో చెప్పారు. ఇప్పుడు చూడండి.– 90 ఇళ్ళకు పైగా నేను వెళ్ళాను" అని బాబా అన్నా, అదృష్టవంతులైన ఎందరి ఇండ్లకో ఆయన వెళ్లి వారి గృహాలను పునీతం చేశారు. బాబా వెళ్ళిన ప్రతి ఇంట్లో కూడా ఆయనకు 'ఆరతులు' ఇచ్చారు. ఆయా 'గృహాలలో' బాబా కొద్ది క్షణాలు గడిపారు.

ప్రప్రథమంగా, 1953 జనవరి 27న ఏలూరులో అప్పట్లో జిల్లా జడ్జిగా ఉన్న శ్రీ కృష్ణారావు నాయుడుగారి బంగళాకు వెళ్ళారు. అక్కడ అనేకమంది బాబాను దర్శించుకున్నారు.

## మెహెర్‌బాబా సందేశం

**ఈ సందర్భంగా మెహెర్‌బాబా తన సందేశం ఇస్తూ– ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఉండాలని నేను గట్టిగా చెప్తున్నాను. గతంలో ప్రజల్లో మున్నెన్నడూ కూడా ప్రస్తుతం ఉన్నంత అవినీతి, కపటం లేదు. అయితే, ఏ మాత్రం కపట ప్రవర్తన మీ మాటల్లో కానీ, చేతల్లో కానీ, ఆలోచనల్లో కానీ వెల్లడైతే, మీలో ఉన్న భగవంతుడు, కనపడకుండా మాయమౌతాడు అని బాబా హెచ్చరించారు. హిపోక్రసీ (కపటం) వెయ్యితలల విష నాగపాములాగ, అత్యంత ప్రమాదకరమైంది. ఈ రోజుల్లో నిజాయితీగా ఉండాలని, ఎలాంటి కపటం లేకుండా ప్రవర్తించాలని ప్రవచనాలు చెప్పే సాధు సజ్జనులు కూడా కపట నాటక సూత్రధారులుగా ప్రవర్తిస్తూ, వారిలో లోలోపల కపటం దాగి ఉంటోందని మెహెర్‌బాబా హెచ్చరించారు.**

**"నేను నా దివ్యాధికారంతో చెప్తున్నాను– నేను ప్రతి ఒక్కనిలో ఉన్నాను. నీవు నిజాయితీతో భగవంతుడ్ని ప్రేమిస్తే, నీవు ఆయన్ని అన్నిచోట్ల చూడగల్గుతావు. అయితే గుర్తుంచుకోండి, నీవు దేవుడిని ప్రేమించలేక పోయినా ఫరవాలేదు. సాధరణ నిజాయితీ జీవితం గడపలేకపోయినా ఫరవాలేదు. కానీ, నీవేదో గొప్ప సాధుసంపత్తి గల నిజాయితీపరుడిగా వేషధారణలతో ప్రజల్ని నమ్మించే ప్రయత్నాలు చేయవద్దు. దొంగ సన్యాసులకంటే సమాజంలో అత్యంత పెద్ద దుర్మార్గులు వేరేలేరని బాబా అన్నారు.**

ఆ రకంగా మెహెర్‌బాబా ఏలూరులోని జిల్లా జడ్జిగారి ఇంటి నుంచి మరొకరి ఇంటికి వెళ్తూ, స్థానిక జిల్లా కలెక్టరు గారు పేరు కూడా తాను వెళ్ళబోయే గృహాల జాబితాలో ఉందా? అని బాబా ప్రశ్నించారు. 'లేదు' అని సమాధానం చెప్పడంతో, ఆయన నన్ను అమితంగా ప్రేమిస్తాడు. ఆయన ఇంటికి వెళ్ళకపోయినా ఫరవాలేదని బాబానే తిరిగి అన్నారు.

## విశ్రాంతి కావాలి- విడిదికి వెళ్దాం

ఆ తర్వాత కొద్ది నిముషాలకే, కట్టా సుబ్బారావుగారి తోటలోని తన గదికి వెళ్ళి, కొంత విశ్రాంతి తీసుకున్నాక తిరిగి ప్రేమికుల ఇళ్ళకు వెళ్దాం అని బాబా అన్నారు. దాంతో బాబాతో పాటు అందరం ఆయన్ని అనుసరించాం. మామిడితోటల దగ్గర కారు ఆగిందో లేదో, అక్కడ బాబా రాకకోసం ఎంతసేపటి నుంచో ఎదురు చూస్తూ నిలుచుని ఉన్న జిల్లా కలెక్టరును బాబా ఆలింగనం చేసుకున్నారు. జిల్లా కలెక్టరు- ఆయన కుటుంబ సభ్యులు పూల మాలలు చేతిలో ఉంచుకుని బాబా కోసం చాలా సేపట్నించి ఎదురు చూస్తున్నారు. బాబాకు వారు పూలమాలలు వేశారు. పాదాభివందనం చేశారు. బాబా ఆలింగనం ఇచ్చారు. ఆ వెంటనే క్షణం కూడా, విశ్రాంతి ఏమీ తీసుకోకుండానే తాను వెళ్ళాల్సిన గృహాల జాబితా ప్రకారం బాబా వెంటనే బయల్దేరారు.

జిల్లా కలెక్టరు- ఆయన కుటుంబ సభ్యులు బాబా దర్శనం కోసం మామిడితోట దగ్గర ఎదురు చూస్తున్నారని తెలుసుకుని అవతారుడు తనకు క్షణకాలం పాటు విశ్రాంతి కావాలనే మిషతో తన బస దగ్గరకు వెళ్ళడం, కేవలం చాలాసేపటిగా ఎదురుచూస్తున్న ఆ కుటుంబ సభ్యులకు మనసారా వారి కోర్కెతీర్చడం కోసమేనని మనకిప్పుడు తెలుస్తుంది. ఇది అవతారుని లీల. సామాన్యులకేం తెలుస్తుంది.

## ఇది అవతారుని లీల

మరొక విశేషం ఏమంటే స్థానిక మెహెర్ సెంటర్ ప్రాంగణాన్ని బాబా సందర్శించి, అక్కడున్న శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి తదితర ప్రేమికులను కలిశారు. సెంటర్‌లో బాబా కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కుర్చీలో కొద్దిసేపు కూర్చున్నారు. అలాగే, గోడకు వేళాడదీసిన భారీ చిత్రపటం కేసి చూసి, రంగారావు ముఖంకేసి ప్రశ్నార్థకంగా బాబా చూశారు. 1952 జూన్‌లో ఆ చిత్రపటాన్ని తయారు చేయించామని శ్రీ రంగారావు బాబాతో చెప్పగా, వబా వెంటనే లేచి, తన చిత్రపటానికి తానే హారతి ఇచ్చి, అక్కడున్న వారందర్నీ ఆశీర్వదించారు. ఆ తర్వాత అక్కడ్నుంచి బయల్దేరారు.

ఆ తర్వాత రంగారావుగారి ఇంటికి వెళ్దామని బాబా సూచించారు. కానీ, అందుకు రంగారావు ఒప్పుకోలేదు. తనింటికి బాబా వచ్చే సమయాన్ని మరో ప్రేమికుని ఇంటికి వెళ్ళడానికి కేటాయిస్తే బాగుంటుందని ఆయనన్నాడు. ఇదొక రకంగా నిస్వార్థానికి ప్రతీకగా ఉంటుందని శ్రీ రంగారావు అన్నారు.

అందుకు బాబా ఏమన్నారో తెలుసా?





**మీరు నన్ను మీ ఇళ్ళకు ఆహ్వానించడం, నేనే తన ప్రేమికుని ఇంటికి వస్తానని చెప్పడంలో ఎంతో తారతమ్యం ఉందని అన్నారు. ఆ మాటలు బాబా నోట వింటూనే ఖిన్నుడైన శ్రీ రంగారావు, బాబా పాదాలను తాకుతూ సాష్టాంగ నమస్కారం చేశారు. (26.1.1953)**

ఆ తర్వాత బాబా శ్రీ రంగారావుగారింటికి వెళ్ళారు. అదొక చిన్న ఇల్లు. ఆ ఇంట్లో వరండాలో నేలపైన బాబా కూర్చున్నారు. టేబుల్‌పై ఉన్న బాబా చిత్రపటానికి బాబానే స్వయంగా హారతి ఇచ్చారు.

రంగారావుగారి భార్య శ్రీమతి ధనమ్మని ఉద్దేశించి- నా ఆశీస్సులు నీకెప్పుడూ ఉంటాయి. రంగారావు నిరంతరం నా సేవలోనే ఉంటాడని బాబా అన్నారు. నా ఆశీస్సులు నీకు, నీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ లభిస్తాయి. మీ కుమారుడు సూర్యప్రకాష్ నాకు చెందినవాడు అని బాబా తన సందేశం ఇచ్చారు.

రంగారావు గారి కుమారుడు సూర్యప్రకాశ్ మెహెర్‌బాబా ఆంధ్రా పర్యటన కంటే ముందునుంచే మతిస్థిమితం లేని స్థితిలో ఉన్నాడు.

బాబా ఏలూరు విచ్చేసిన వెంటనే, ఆ పిల్లవాడ్ని, తన మండలిలో ఒకరికి అప్పగించి, బాబా ఏలూరులో బస చేసినన్ని రోజులు ఆతన్ని జాగ్రత్తగా చూసుకునేలా ఆదేశించారు. ఏలూరు నుంచి బాబా తిరిగి వెళ్ళిపోయే ముందు, ఆ పిల్లవాడ్ని రంగారావు గారికి అప్పగిస్తూ బాబా ఇలా అన్నారు. ప్రస్తుతం ఈ పిల్లవాడు ఒక సాధారణ బాలునిగానే ఉన్నాడు. అతనికి బాగా చదువు చెప్పించండి. అతను మరే ఇతర దేవాలయాలను వెళ్ళకుండా చూడండి. ఆతని మెడలో పూల దండలు వేయడం, పాదాలకు నమస్కరించడం లాంటివి చేయకుండా జాగ్రత్త వహించండి. ఎప్పటిలాగానే, ఒక సాధారణ పిల్లవానిలాగానే ఆతడ్ని చూడండి. సరైన సమయంలో, నేను భావిస్తే ఒక సజ్జన- సాధువుగా నేను తీర్చిదిద్దుతాను అని బాబా రంగారావు దంపతులకు తన సందేశం ఇచ్చారు.

15.01.1953న శారదానివాస్, మద్రాసు నుంచి మెహెర్‌బాబా- సో॥ ఏరుచ్ చేత రంగారావుగారి కుమారుడు సూర్యప్రకాశ్‌ను ఉద్దేశించి ఒక ఉత్తరం రాశారు.

ఆ లేఖలో బాబా మాటలు ఇలా ఉన్నాయి.

“సూర్య ప్రకాశ్ మామూలుగా ప్రవర్తిస్తున్నాడని తెలిసి నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు- ఎలాంటి మారు ఆలోచన లేకుండా తెలుసుకోవాల్సిది ఏమంటే- నేను అతన్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. అతను కూడా నన్ను అదేమాదిరిగా- ప్రేమిస్తున్నాడు. అయితే, నన్ను అనుకరిస్తున్నట్లు మౌనంగా ఉండి, అక్షరఫలకం చేతిలో పట్టుకుని, ప్రసాద

వితరణ లాంటి పనులు చేయడం వల్ల ఆతని ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధమని గుర్తించండని బాబా హెచ్చరిచారు. ఆతని ఆధ్యాత్మిక ప్రగతిని కాంక్షిస్తూ, ఒక గొప్ప వ్యక్తి (సెయింట్)గా రూపొందించాలని నేను కోరుకుంటున్నాను. అయితే, పైపై మెరుగులు (Superflous) చేసే అనుకరణలతో ఆతన్ని కొందరు ప్రోత్సహించడం వల్ల సూర్యప్రకాశ్‌కి గొప్ప నష్టం వాటిల్లుతుంది. అలాకాక, ఆతని ఆధ్యాత్మిక ప్రగతికి దోహదపడాలి. అనుకరణలను discourage చేయవల్సిందని నేను కోరుతున్నాను. సూర్యప్రకాశ్ నన్ను అమితంగా ప్రేమించేలా ప్రోత్సహించవల్సింది. నా నిజమైన ప్రేమికుల మాదిరి అతను నాకు చెందిన వ్యక్తి, నేను ఆంధ్రాలో కాలిడిన నాటినుంచి ఆతడ్ని నాకు అప్పగించడమైంది. ఆతని జీవన విధానంలో నేను తప్ప- మరొకరు ఎవరూ interfere కావద్దు అని మెహెర్‌బాబా తన లేఖలో స్పష్టం చేశారు.

## మెహెర్‌బాబా తన దివ్యత్వ ప్రకటన

నాకు గుర్తున్న ప్రకారం 27.1.1953న బాబా విడిదిచేసిన కట్టా సుబ్బారావు గారి మామిడి తోటలోనే ఒక ముఖ్య సంఘటన జరిగింది. విడిది గృహానికి ఎదురుగా వేసిన చలువ పందిళ్ళలో విచ్చేసిన వారందరికి బాబా దర్శనం ఇస్తున్నారు. కొన్ని వందల మంది ఉన్నారు. ఒకప్రక్క భజనలు, గీతాలాపన జరుగుతోంది. కాంతులు వెదజల్లుతున్న అందమైన బాబా ముఖారవిందాన్ని, ఆయన చూపులను కళ్లార్పకుండా ఆయన దివ్య మంగళ సుందర రూపాన్ని విచ్చేసిన వారందరూ దర్శనం చేసుకుంటున్నారు. అలా కొంతసేపు గడిచాక, అకస్మాత్తుగా బాబా తన గదిలోనికి వెళ్ళిపోయి, ఏలూరు మెహెర్ సెంటర్‌కు చెందిన ప్రేమికులందర్నీ లోపలికి పిలిపించారు. సుమారు 30 మంది బాబా ఉన్న గదిలోకి వెళ్ళి, నేలపైనే కూర్చున్నారు. తన ప్రేమికులందర్నీ చూస్తూ, బాబా ఒక కుర్చీలో కూర్చున్నారు. ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ ఆర్.వి.రామారావు నాయుడు స్థానిక బాబా ప్రేమికులందర్నీ పేరుపేరునా పిలిచారు. ఆ తర్వాత బాబా రామారావు నాయుడుకేసి చూసి, గది తలుపులు మూసి ఆయన్ని కూడా కూర్చోమన్నారు. సో॥ ఏరుచ్ బాబా ఇచ్చే సందేశాలను తెలియజేయడానికి బాబా కుర్చీ పక్కనే నిలబడ్డారు. స్థానిక బాబా ప్రేమికులతో గదిలో సమావేశమై ఉండగా పందిళ్ళలో ఉన్న జనసందోహాన్ని బాబా తిరిగి బైటకు వచ్చేవరకు ప్రశాంతంగా, కూర్చోవల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

**ఆ సమయంలో మెహెర్‌బాబా చాలా గంభీరంగా, కోపంగా ఉన్నారనిపించింది. ఊహించని రీతిలో, నిస్సందేహంగా దివ్యత్వ ధోరణిలో ఉన్నారు. గదిలో ఉన్న బాబా ప్రేమికులందర్నీ బాబా ఇచ్చే సందేశం వినడానికి సిద్ధంగా ఉండమని సో॥ ఏరుచ్ ప్రకటించారు. అందరూ ఎంతో ఆతృతగా ఉన్నారు. ఈ సమయంలోనే- మెహెర్‌బాబా మాట్లాడుతూ "నా దివ్యాధికారంతో నేను భగవంతుడనని చెప్తున్నాను". అకస్మాత్తుగా బాబా ఇలా తన**





**దైవత్వ ప్రకటీకరణ చేస్తుండడంతో, ప్రతివారు తన్మయులయ్యారు. అచేతనులయ్యారు. అమితమైన ఆనందాన్ని పొందారు. కొద్ది క్షణాల తర్వాత తిరిగి ఏరుచ్ అందర్నీ శ్రద్ధగా బాబా మాటలు ఆలకించమని హెచ్చరించారు. "నా దివ్యాధికారంతో చెప్తున్నాను. నేను భగవంతుడను. భౌతిక రూపంలో నున్న భగంవతుడను. నేను మాత్రమే సత్యం. మిగిలినదంతా మిథ్య. నన్ను హృదయపూర్వకంగా ప్రేమించండి" అని బాబా చాలా స్పష్టంగా, తన దివ్యాధికారంతో ప్రకటించారు. అక్కడున్న మా అందరికీ ఆ క్షణంలో మెహెర్‌బాబా దర్శనం భగవంతుని యొక్క మొదటి విశ్వరూప దర్శనంగా అనిపించింది. యుగావతారుని యొక్క దివ్యత్వం, దివ్యప్రేమతో ఆ గది అంతా నిండిపోయింది. ఆ విధంగా బాబా తన దివ్యత్వాన్ని తన బిడ్డలందరికీ తెలియజేశారు. ఈ ప్రకటీకరణ జరగకపోతే బాబా యొక్క దివ్యత్వం సాధారణ మానవులమైన మనకు ఎలా తెలిసేది. ఆ క్షణం నుంచి బాబా దేవదేవుడిగ మా అందరి హృదయాలలోను చోటు చేసుకున్నారు. గదిలోని సమావేశం ముగిసిన వెంటనే బాబా పందిరిలోనికి వెళ్ళి ఆ రోజు మిగతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.**

## మరొక ముఖ్య సంఘటన

ఆ తర్వాత జరిగిన మరొక ముఖ్య సంఘటన. 7,8 సంవత్సరాల వయసున్న ఒక బాలుడు బాబా దర్శనం చేసుకోవాలనుకున్నాడు. బాబాను చూడాలని ఆ బాలుడు ఎంత గాఢంగా కోరుకుంటున్నాడో అతని తల్లిదండ్రులకైతే బాబా పట్ల ఏమాత్రం ఇష్టంలేదు. ఆ బాలుడు ఏలూరులోని "థియోసాఫికల్ స్కూలు"లో చదువుతున్నాడు. ఒకరోజున బాబా బయట ప్రయాణం చేస్తుండగా తన కారు ఆ స్కూలు దగ్గరకు రాగానే అకస్మాత్తుగా కారునాపమన్నారు. కారు దిగి తనంతట తానే స్కూల్లో చదువుతున్న ఆ బాలుడున్న తరగతి దగ్గరకెళ్ళి ఆ బాలుణ్ణి కౌగలించుకుని, ప్రేమగా దీవించి, బాబా తిరిగి తన ప్రయాణం కొనసాగించారు. ఈ సంఘటన చూసిన ఆ స్కూలులోని ఉపాధ్యాయులు తదితరులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ఆ బాలుడు తన ఇంటికెళ్ళి అతని తల్లిదండ్రులకు అవతారుడైన మెహెర్‌బాబా తన స్కూలుకి వచ్చి తనకు దర్శనమిచ్చారన్న సంగతి తెలియజేశాడు. మొదట వారు నమ్మకపోయినప్పటికి, జరిగిన నిజాన్ని తెలుసుకొని, వారు కూడా బాబా దగ్గరకు వెళ్ళి ఆయన దివ్య దర్శనం చేసుకున్నారు.

ఏలూరులోనే పోలీసు సూపరింటెండెంటు కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్న శ్రీ పి.వీరాచార్యులు అనే వ్యక్తి బాబాను తమ ఇంటికి కూడా ఆహ్వానించాలనుకున్నాడు. కానీ, ఆతని ఇళ్ళు బాబా సందర్శించేవారి ఇళ్ళ లిస్టులో లేదు. ఈ విషయం తెలుసుకుని శ్రీ వీరాచారి చాలా బాధపడతాడు. శ్రీ వీరాచారి భార్య గర్భవతి. క్యూలో నిల్చుని బాబా దర్శనం చేసుకోవడం కష్టం. బాబా దర్శనం చేసుకోవాలని ఆమెంతో ఆతృతగా ఉంది. అయితే ఒకరోజున ఉన్నపళంగా, బాబా వాళ్ళింటికి వస్తున్నట్టు కబురు చేసారు. మరో

ఐదు నిముషాల్లో బాబా తన పరివారంతో వాళ్ళింటి వెనుకవైపుకు చేరుకున్నారు. ఆ ఇంటి వెనుక గుమ్మం నుంచే వాళ్ళింట్లోకి బాబా ప్రవేశించారు. వెనుక గుమ్మం చాలా చిన్నదిగా ఉంది. బాబా బాగా వంగి ఆ గుమ్మంగుండా లోనికి వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నారు. వీరాచారి దంపతులు బాబాకు ఆరతిచ్చారు. బాబా వారిని దీవించి, తిరిగి ఆ వెనుక ద్వారం నుంచే తిరిగి వెళ్ళారు.

కార్యనిర్వాహకులు ఏర్పాటుచేసిన విధంగానే బాబా ఇళ్ళకు వెళ్ళడం జరిగేది. నిజానికి బాబాకు గృహదర్శనాలు ఇష్టం లేనప్పటికీ బాబా చాలామంది ఇళ్ళు సందర్శించడం జరిగింది. యుగావతారుడైన బాబా ఆయన పవిత్ర పాదాలతో ఆ ఇళ్ళంటినీ పునీతం చేశారు. ఈ ఇళ్ళ దర్శనాల సందర్భంలోనే బాబా "వెంకట్రామ పవర్ ప్రెస్" అనే ముద్రణాలయాన్ని కూడా దర్శించడం జరిగింది. మెహెర్‌బాబా మొదటి ఆంధ్రా పర్యటన సందర్భంగా బాబా అనేక వేల చిత్రాలను, ఆయన సందేశాలతో కూడిన కరపత్రాలను ఈ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించడం జరిగింది. ఆ ప్రెస్‌లో అర్ధగంట పైగా బాబా గడిపి అక్కడున్న పనివారందరిని బాబా దీవించారు. ఈ **House visits** సందర్భంలో మా కలకత్తా బృందాన్ని కూడా ఉండమని బాబా చెప్పడం జరిగింది. బాబాతో మా బృందం ప్రయాణించడానికి వీలుగా ఒక వాహనాన్ని ఏర్పాటుచేసే బాధ్యత KDRMకి అప్పజెప్పారు.

మేము ఏలూరు చేరినరోజు రాత్రే రంగారావు గారిని కలిసి, మరుసటిరోజు జరగబోయే బాబా దర్శన కార్యక్రమ వివరాలు తెలుసుకున్నాం. ప్రియతమ బాబాకు పూలదండలు వేయవచ్చా, లేదా అనే ఒక సందేహం మాకుండేది. రంగారావుగారు మాత్రం మరునాడుదయమే బాబా దగ్గరకు తీసికెళ్ళి బాబాకు పూలమాలలు సమర్పించుకునే ఏర్పాటు తాను చేస్తానని మాకు వాగ్దానం చేశారు. ఆ విధంగా మమ్ములనందరిని మార్వాడు తెల్లవారుఝామునే బాబా విడిది గృహం దగ్గరుండమని చెప్పారు. సరిగ్గా అర్ధరాత్రి అవుతుండగా మర్నాటి ఏర్పాట్ల గురించి మాట్లాడటానికి తోటనుంచి చలపతిరావుగారు రంగారావు గారింటికి వచ్చారు. బాబాతో వచ్చిన సో॥ రమ్జూ అబ్దుల్లా అనారోగ్యంగా ఉన్నట్లు, ఆయన కోసం ఒక డాక్టరుని ఏర్పాటు చేయవలసిందిగా శ్రీ రంగారావుకి తెలియజేశారు. బాబా ఆదేశాల మేరకు, ఆ డాక్టరు తోటలో అడుగుపెట్టిన వెంటనే బాబా విడిది గృహం వైపు చూడకుండా, తిన్నగా మండలి ఉంటున్న చోటుకెళ్ళి, రోగిని పరీక్షించి మరల అదేవిధంగా తిరిగి రావలసి ఉంది. అయితే, డాక్టరుని ఎవరు తీసుకొస్తారు?" అనే ప్రశ్న వారి సంభాషణలోరాగా ఆ అవకాశాన్ని నాకివ్వడం జరిగింది. నేను డా॥ కనకదండి సూర్యనారాయణ గారింటికెళ్ళి ఈ విషయం తెలియజెయగా, ఆయన వెంటనే బయలుదేరి తోటకు వచ్చి, బాబా ఆదేశానుసారం రోగి దగ్గరకు వెళ్ళి పరీక్షించి మందులిచ్చి తిరిగి వెళ్ళారు.

**–సశేషం**





# శ్రీకాకుళం కేంద్రం

**అ**వతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్రంలో 02.08.2009 ఆదివారం ఉచిత నేత్ర వేద్యా శిబిరం డా॥ పి.ఎల్.ఎన్. రాజు , డా॥ కె.ఎల్. నాయుడుల సహకారంతో నిర్వహించడమైనది. 58 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన 23 మందికి కంటి ఆపరేషన్లు, మందులు ఇవ్వడమైంది. ఆగష్టు 30న శ్రీకాకుళం బాబా కేంద్ర 48వ వార్షికోత్సవం కదురమ్యముగా జరుపుకొనడమైనది. ఉ॥ 5 గం॥లకు నగరసంకీర్తన అనంతరం ఉదయం 8.30 ని॥ లకు సో॥ కె.హెచ్.కె. ప్రసాద్, హైదరాబాద్ గారిచే సప్తవర్ణ పతాకావిష్కరణ గావించబడినది. పతాక విశిష్ఠత గురించి సో॥ కె.నారాయణ రావు రాజమండ్ర వివరించారు. శ్రీమతి కె.శారదా ప్రసాద్ పేద విద్యార్థులకు యూనిఫారములు పంపిణీచేశారు. సహవాస్‌లో డా॥ కేశవరావు, విజయవాడ, శ్రీ బి.రామకృష్ణయ్య, హైదరాబాద్, శ్రీ హరిమెహెర్, విశాఖపట్నం ప్రసంగించారు.

శ్రీమతి నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవతార్ విశిష్టతను వర్ణిస్తూ నృత్యరూపకము 16 మంది పిల్లలు బహు చక్కగా ప్రదర్శించారు.

# ఎరికో బాబాలో ఐక్యం



మెహెరాబాద్‌లో స్థిరనివాసముంటున్న పాశ్చాత్య బాబా ప్రేమికులు **ఎరికో, హీదర్** దంపతులను ఇటీవల కొందరు గుర్తు తెలియని దుండగులు వారిపై దాడిచేసి తీవ్ర గాయాలకు గురిచేశారన్న సంగతి పాఠకులకు తెలుసు. కాగా ఎరికో పూనేలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 6 ఉదయం 11.30 ని॥లకు తుదిశ్వాస విడిచి బాబాలో లీనమయ్యారు. ఆయన అంత్యక్రియలు మెహెరాబాద్‌లో మండలి సభ్యుల సమక్షంలో సెప్టెంబర్ 7న జరిగాయి. ఎరికో మెహెరాబాద్‌కు 1971 ప్రాంతంలో వచ్చి స్థిరపడ్డారు. సుమారు 15 సంవత్సరాలపాటు మెహెరాబాద్‌లోనే ఉన్న మహ్మద్ మస్తుకు ఆయన అనేక సేవలు అందించాడు. సుమారు గత మూడు దశాబ్దాలకు పైగా మెహెరాబాద్‌లోనే స్థిరపడ్డ ఎరికో బాబా సేవలో ఎనలేని ఆనందం, తృప్తి చెందాడని ట్రస్ట్ సభ్యులు తమ సంతాపంలో పేర్కొన్నారు.

# 1954 సెప్టెంబరు 12



**మె**హెర్‌బాబా ప్రేమికులకు సెప్టెంబరు 12కు చాలా ముఖ్యమైన రోజని చెప్పాలి.

**అవతార్ మెహెర్‌బాబా 1954 సెప్టెంబరు 12న అహ్మద్‌నగర్‌లోని వాడియా పార్కులో గొప్ప బహిరంగ దర్శనం ఇచ్చారు.**

**అహ్మద్‌నగర్‌లో అవతారుడు తొలిసారిగా ఇచ్చిన బహిరంగ దర్శనమది.** ఈ ప్రాంతంలో ఇదే కడపటిది కావడం కూడా విశేషం.

ఈ ప్రజా దర్శనంలో స్థానికులు, అహ్మద్‌నగర్‌కు చుట్టు ప్రక్కల గల అనేక గ్రామస్థులు, సుమారు ఒక లక్షమందికి పైగా మెహెరుడిని దర్శించుకున్నారు.

ముందురోజు రాత్రే ఎందరో ఎడ్లబండ్లను కట్టుకుని నగర్ చేరుకున్నారు.

ఢిల్లీ, డెహ్రాడూన్, నాసిక్, నాగపూర్, పూనే, ముంబాయి, ఇలా పలు ప్రదేశాలనుండీ ఎందరో అవతారుని దర్శనానికై నగర్‌కు చేరుకున్నారు.

పాశ్చాత్య బాబా ప్రేమికులు కూడా ఓ 20 మంది ప్రత్యేకంగా ఈ దర్శన కార్యక్రమానికై వచ్చారు.

బాబా సెప్టెంబరు 12న ఉదయం 9 గంటల కల్లా పార్కులో ఏర్పాటుచేసిన వేదికపైకి వచ్చారు. బాబా వేదికపై కూర్చున్న కొద్ది క్షణాల్లోనే క్రిందకు దిగి మీరందరూ వచ్చి నా పాదాలకు నమస్కరించడం వల్ల చాలా సమయం వృధా అవుతుంది. కాబట్టి, భగవంతుడు - భగవంతునికి నమస్కరించే రీతిలో మీ అందరికీ నమస్కరిస్తున్నానని ప్రకటించి, విచ్చేసిన ప్రజలందరికీ వంగి నమస్కరించారు. ముందుగా, ఏడుగురు పేదవారి కాళ్ళు కడిగి దైవ దక్షిణగా ఒక్కొక్కరికి 51 రూపాయలు చొప్పున ఇచ్చారు.

ఏడుగురు మహిళలు బాబాకు ఆరతిని ఆలాపించారు. అనంతరం, బాబా





ప్రేమికుడు గాడేకర్ బాబాకు ఆరతిని ఆలాపించారు. అనంతరం, అహ్మద్‌నగర్ పురపాలక కార్పోరేషన్ పౌర సన్మాన పత్రాన్ని అవతారునికి అందించింది.

ఈ సందర్భంగా బాబా మూడు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు.

వాటిని ఇంగ్లీషులో సరోష్ ఇరానీ చదివి వినిపించారు. తిరిగి, డా. సి.డి. దేశ్‌ముఖ్ మరాఠీలో అనువదించి ఆ సందేశాలను చదివి వినిపించారు. ముందుగా **MEHER BABA'S CALL** అని తన సందేశం ఇచ్చారు.

**I tell you all with my divine authority that you and I are not WE but ONE.**

**There is nothing but God. He is the only Reality, and we all are one in the invisible Oneness of this absolute Reality,** అని పేర్కొన్నారు.

**Do not waste your precious life span in differenciating and judging your fellow men, but learn to long for the love of God. Even in the midst of your worldly activities, live only to find and realise your true Identity with your Beloved God.**

భగవంతుని ప్రేమ పొందేందుకు మీ జీవితకాలాన్ని వినియోగించమని బాబా తన సందేశంలో పేర్కొన్నారు. అంతేకానీ, మీ చుట్టూతావున్న వారి మంచి-చెడులపై బేరీజులువేస్తూ కాలం వృధా చేయొద్దని బాబా తన సందేశంలో పేర్కొన్నారు. ప్రాపంచికంగా అందరి మధ్యన వుంటూ కూడా, భగవంతుని కోసం జీవితకాలాన్ని వెచ్చించమని బాబా తన సందేశంలో అన్నారు. ఈ మాదిరిగా బాబావారి ప్రత్యేక సందేశాలు ఇచ్చిన పిదప ప్రజాదర్శనాన్ని ప్రారంభించారు. పండరీపురం నుండి గాడ్గే మహారాజ్, సాకోరీ నుండి గోదావరిమాయీ కూడా ఈ కార్యక్రమానికై వచ్చారు.

అనంతరం ప్రజా దర్శన కార్యక్రమం ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల దాకా కొనసాగింది. బాబా అలుపెరగకుండా తండోపతండాలుగా వచ్చిన వారందరికీ స్వయంగా తన స్వహస్తాలతో ప్రసాదం ఇచ్చారు. మెరుపు వేగంతో బాబా ప్రసాదం పంచిపెట్టారు. మరో ప్రక్కన ఆ రోజున ఓ 20,000 మందికి పైగా ఉచిత భోజన ఏరాట్లు పార్కు ఆవరణలో చేశారు. ఆ రోజున మధ్యాహ్నం 3 గంటల దాటాక బాబా తన దర్శన కార్యక్రమానికి 15 నిముషాలు విరామం ఇచ్చి అక్కడే నేల మీద పేదల సరసన కూర్చుని సహపంక్తి భోజనం చేశారు.

# జూబ్లీ సహవాస్ సెప్టెంబరు 12, 13 తేదీలలో



1954 సెప్టెంబరు 12న అహ్మద్‌నగర్‌లో జరిగిన ఇంతటి విశేష కార్యక్రమంలో ఆనాడు పాల్గొన్నవారిని ఆహ్వానించి ఆనాటి వారి అనుభవాలు మధుర స్మృతులను మరోమారు సింహావలోకనం చేసుకునేలా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్సులో ఈ నెల 12, 13 తేదీలలో రెండురోజుల మెహెరుని సహవాస్ ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమానికి నాంది పలికింది నోరి మెహెర్‌చంద్‌గా చెప్పుకోవాలి. ఆయనగారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సహవాస్ కార్యక్రమంలో, ఓ 50 సంవత్సరాలు వెనెక్కివెళ్ళి ఆనాటి విషయాలను తిరిగి మననం చేసుకునే వీలు దొరికింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యంగా అవతారుని దర్శన కార్యక్రమంలో పాల్గొన్న - శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ డి. ఆర్. గాడేకర్, శ్రీ ప్రతాప్ ఆహిర్, శ్రీ సురేంద్ర థాడే, శ్రీ నరేంద్ర థాడే ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. సెప్టెంబరు 12వ తేదీ సాయంత్రం 3.30 నిముషాలకు సహవాస్‌ను ప్రారంభించారు. సాయంత్రం 6.30 నిముషాలకు ధుని కార్యక్రమం నిర్వహించారు. ఈ మధ్య సమయంలో మెహెర్‌నాథ్, గాడేకర్‌సాబ్ తదితరులు ప్రసంగించారు.

శ్రీ గాడేకర్ మాట్లాడుతూ, 1954 సెప్టెంబరు 12న బాబావారి ప్రజాదర్శన కార్యక్రమం నాటికి నా వయస్సు 19 ఏళ్ళని, యవకునిగా వున్నానని తన జ్ఞాపకాలను బాబా ప్రేమికులతో పంచుకున్నారు. ఆనాటి కార్యక్రమానికి నేను వాలంటీరుగా వున్నాను. ఆ రోజున నేను బాబావారికి ఎంతో దగ్గరగా వున్నాను. మా తల్లి, తండ్రి కూడా ఆనాటి కార్యక్రమంలో వాలంటీర్లుగా వున్నారు. ఆ జనసందోహం, అవతారుని దివ్యదర్శనంతో మైమరిచిపోయిన ప్రజానీకం, అశేష ప్రజానీకానికి అవతారుని ప్రసాదవితరణ, అవతారుని సందేశాలు, ఇలా ఆనాటి విషయాలను మాటల్లో అభివర్ణించడం అలవికానిదని అన్నారు. అదొక అద్భుత లీలా విలాసంగా వర్ణించారు.





మెహెర్‌నాథ్ కల్చూరీకి అప్పట్లో ఐదారేళ్ళుంటాయి. పసిప్రాయంలో వున్నాడు. వారి తండ్రి శ్రీ భావూ కల్చూరీ, ప్రస్తుత బాబా ట్రస్టు చైర్మన్, అప్పటికే బాబా దగ్గరి మండలి సభ్యునిగా చేరి రెండుమూడేళ్ళు దాటుతుంది. ఆయన తన భార్యా పిల్లలను పుట్టింట్లో వదలిపెటారు.

కాగా, చంటి పిల్లలైన మెహెర్‌నాథ్, కుమార్తె షీలాను తీసుకుని, వారి తల్లి రమా కల్చూరీ, నాగపూర్ నుండి బాబా దర్శనానికై అక్కడ్నించి తెలిసిన బాబా ప్రేమికులు వస్తుంటే వారితో కల్సి తన పిల్లలతో సహా వచ్చి, క్యూలో నిల్చుంది. బాబా ఈమెను చూస్తూనే భావూకేసి చూసి ఈమె ఎవరో తెలుసా? అని అడిగారు. భావూజీ తెలుసని, ఆమె పేరు రమా అని, తన భార్య అని చెప్పారు. పిల్లలగురించి అడిగి తెలుసుకుని బాబా వారిని ముదాడారు. బాబా భావూకి ఓ పదినిముషాలు భార్యా పిల్లలతో మాట్లాడ్డానికి అనుమతిచ్చారు.

అంతేకాదు నీ భర్త, మిమ్ములందర్నీ వదిలి నా దగ్గరకు రావడం నీకు ఇష్టమేనా? అని రమా కల్చూరీని తొలిసారిగా వాడియా పార్కు దర్శన కార్యక్రమంలోనే బాబా అడిగారు. మెహెర్‌నాథ్ కల్చూరీ ఈ విషయాలనన్నింటినీ మననం చేసుకుంటూ, ఇటీవల మెహెరాబాద్‌లో బాబా సమాధి దగ్గర కాపలాదారుడిగా వుంటూ కొందరి దుండగుల చేతిలో గాయపడి, పూనేలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, బాబాలో ఐక్యమైన **ఎర్రికో** ఆత్మ శాంతికై మౌనం పాటిద్దామని కొద్దినిముషాలు మౌనం ప్రకటించారు. బాబా భగవంతుడు. ఆర్తితో ఆయన్ని పిలిస్తే ఆయన తప్పక పలుకుతాడని మెహెర్‌నాథ్ అన్నారు. పాశ్చాత్య బాబా ప్రేమికుడు హరికెన్‌మోర్ తన హృదయాంతరాల్లోంచి బాబాని పిలిచినట్లు ప్రార్ధనలు చేశేవాడని, అది బాబాకెంతో ఇష్టమని గుర్తుచేశారు. వాడియాపార్కులో బాబా దర్శనం చేసుకున్న ప్రతాప్ ఆహిర్ తన జ్ఞాపకాల దొంతర్లలోంచి మాట్లాడుతూ, ఆ రోజున పూనేనుంచి స్నేహితులు కొందరితో కలిసి సైకిళ్ళపై 10గంటలు ప్రయాణం చేసి నగర్‌లోని వాడియా పార్కులోని బాబా దర్శన కార్యక్రమంలో పాలొన్నామని, బాబా ఆశీశ్శులు అందుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర థాడే, శ్రీ నరేంద్ర థాడే కూడా ప్రసంగించారు.

అనంతరం కుమారి వినీల, రమ్య, ఆశ్యర్య చక్కని అవతారుని పాటలు ఆలాపించారు. మెహెర్ ప్రసాద్‌రాజు ఆంధ్రా సెంటరు కార్యకలాపాలను వివరించారు. శ్రీ బి. రామ కృష్ణయ్య తన సహజ చతురతతో కార్యక్రమాలను బహు రమ్యంగా నిర్వహించారు. బాబా ప్రేమికులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. అనంతరం సెప్టెంబరు 14న, సోమవారం సాయంత్రం తిరిగి మెహెర్ కోఠి సెంటర్లో మెహెరాబాద్‌నుంచి వచ్చిన బాబా ప్రేమికులందరితో కల్సి సత్సంగ్ నిర్వహించారు.

మెహెర్‌బాబా సెప్టెంబర్ 2009



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

మరి ఒకోమతం ఒకోరకంగా ఎందుకు వుంది. అన్ని మతాలు ఒకేలా ఎందుకులేవు. ఈ ప్రశ్నలకి కూడా బాబా జవాబుచెప్పారు. బుద్ధుడి కాలంవేరు. మహమ్మద్ ప్రవక్త కాలం వేరు. తమ అవతార కాలపు పరిస్థితులకి తగ్గట్టుగా ప్రజల మానసిక పరిపక్వతకి తగ్గట్టుగా తమ బోధనలని చేశారు. మార్గనిర్దేశకత్వం చేశారు అన్నారు.

భగవదన్వేషణ యాత్ర ఎలా సాగుతుందో చెప్పడానికి వో బొమ్మగీసి చూపించారు. సాధకుడు వివిధ భూమికలను దాటుతూ ఎలా వెడతాడో పేర్కొన్నారు. పరమాత్మతో లీనం కావటంతో జన్మసార్థకమవుతుంది. ఆ గమ్యం చేరటానికి షరీయత్, తరఖత్, మరేఫట్, హికీకత్ అని నాలుగు దశలున్నాయని సూఫీలు చెప్తారు.

షరియత్ అంటే మతపరమైన ఆచార వ్యవహారాలు. తరీఖత్ అంటే అంతర్‌దృష్టి. మరేఫట్ అంటే అంతరజ్ఞానం, హకీకత్ ఆఖరి స్థాయి. అదే పరమాత్మానుభవం.

మంచినీళ్ళు రుచిగా వున్నది లేనీదీ నోట్లో పోసుకుంటే తెలుస్తుంది. కానీ నోటిలో పోసుకోకుండా అసలు మంచినీళ్ళు వున్నాయో లేదో కూడా పట్టించుకోకుండా మంచినీళ్ళకోసం ఆరాటపడటం వుండే అది షరియత్. నుయ్యిని త్రవ్వడం, ఆ నూతిలో నీళ్ళు తేటగా కనపడడం ఇది తరీఖత్. ఇహపోతే, బాగా లోతుగా నుయ్యి త్రవ్వడం అందులో నీళ్ళు పడటం మరేఫట్ క్రింద చెప్పవచ్చు. హాయిగా ఆ నీళ్ళు త్రాగటం వుండే, అదే హకీకత్ పరమాత్మనుభవం.

ఈ విశ్లేషనాన్ని మరోరకంగా కూడా చెప్పవచ్చు. బొంబాయి వెళ్ళాలనుకొన్నారు. మ్యాప్ సంపాదించారు. ఆ నగరంలో ఎక్కడకి ఎలా వెళ్ళాలో, ఎక్కడెక్కడ ఏమున్నాయో మ్యాప్ చూస్తుంటే తెలిశాయి. షరీయత్ కూడా అంతే. ఇహ బొంబాయిని చేరటానికి పడే కష్టం – రైలు టికెట్టు కోసం డబ్బులు సమకూర్చుకోవటం, స్టేషన్‌కి వెళ్ళటం, టిక్కెట్టుకొని రైలు ఎక్కడం – తరీఖత్ అనవచ్చు.

బొంబాయి దగ్గరపడుతూంటే కనిపించే నగర శోభని మరేఫట్ అనుకొంటే బొంబాయినగరంలో అడుగు పెట్టుగానే కలిగే మహదానందం వుండే, అదే హకీకత్, అన్నారు బాబా. ఇంకో చక్కటి ఉదాహరణ ఇచ్చారు. ఫోటోలో ఆవుని చూస్తే అది షరియత్. ఆవు కోసం నానా కష్టాలు పడి డబ్బు సంపాదించడం, ఆవుని కొనడం తరీఖత్. ఇహ ఆవు పాలు మరేఫత్. పాలు త్రాగడం హకీకత్ అని బాబా చెప్తుంటే, 'ఔరా' ఎంతనిజం. ఇది అర్థం కావాటానికి వో జీవిత కాలం చాలదు కదా, అని మండలి వారు అనుకొన్నారు.

బహుశా మండలి మనోభావాల్ని చదివారేమో బాబావారు, మరోమాట శెలవిచ్చారు.

సద్గురువుతో కానీ, అవతారునితో కానీ సంపర్కంలోకి వచ్చినవారు పాటించాల్సిన మతం, విధేయత. సద్గురువు పట్ల, అవతారుని పట్ల మనసావాచా విధేయులుగా వుండటమే గొప్పమతం. అంతకుమించిన మతం ఇంకొకటి లేదు.

నేను రోజూ చెప్తున్నాను. సమయం దగ్గర పడింది అంటున్నాను. మిమ్మల్ని తయారుగా వుండమంటున్నాను. జాగ్రత్తగా వుండమని హెచ్చరిస్తున్నాను ఎందుకో తెలుసా. మీరు సిద్ధంగా వుంటేనే మిమ్మల్ని నేను ముందుకి తీసుకు వెళ్ళగలను. నాకిష్టమనిపిస్తే ఎంతమందికైనా భగన్మార్గం చూపిస్తాను. ఐదుగురు అయినాసరే, యాభయి మంది అయినా సరే. చివరకు సగం ప్రపంచానికి అయినా సరే. నేను ఒకేసారి మార్గం చూపించ గలను. కానీ, నేను అలా చెయ్యాలంటే నా ఇచ్ఛ సరిపోదు. అవతల వ్యక్తులు కూడా నా అనుగ్రహానికి అర్హులుగా వుండాలి. అందుకనే సమయం దగ్గర పడుతోంది. తయారుగా వుండండి అని మీకు నేను రోజూ చెప్తున్నది.

నేనే పూజారిని. నేనే పూజను. పూజార్హుడని నేనే. అగ్నిని నేనే. అగ్ని కణాన్నీ నేనే. పొగనీ నేనే. నేనే సర్వం.

నేనీ మాటల్ని ప్రతిరాత్రి అనుకొంటూంటాను. నాకోసం నేనే ప్రార్థన చెప్తాను. భక్తితో నమస్కరిస్తాను. ఎందుకో తెలుసా? ప్రపంచం కోసం. ప్రజల కోసం. భగవంతుడు వాళ్ళని ముక్తికి అర్హులని చేస్తాడని. భగవంతుడు ఎవరు? నేనే భగవంతుడిని, అని బాబా అన్నారు.

మరో ఐదురోజులు గడిచాక అంటే డిసెంబరు తొమ్మిదవ తేదీన బాబావారు సద్గురువుల గురించి ఎన్నో సంగతులు చెప్పారు. సంస్కారాలు పూర్తిగా పోవాలి. లేని

పక్షంలో సంపూర్ణ వైరాగ్యం రాదు అన్నారు. సంస్కారాలు పోయేమార్గం వుందన్నారు. సంస్కారాలని ఢీ కొట్టి వెనక్కి పంపగల సంస్కారాలని సృష్టించాలన్నారు. అంటే సంస్కారాలకి ఢీటి అయిన వ్యతిరేక సంస్కారాలకి ప్రాణం పోయాలి. వాటివల్ల మనస్సుని ఆవరించిన సంస్కారాల పొరలు తెగిపోతాయి. గుడ్డపై మరకపడితే ఏం చేస్తారు. నిమ్మకాయ పిండుతారు. సబ్బుపెట్టి వుతుకుతారు. కానీ మనస్సుని పట్టిన సంస్కారాల మాలిన్యం కడగటానికి చిట్కాలులేవు. మనస్సు దానంతటదిగా చావదు.

మీ చెయ్యి విరగగొట్టాలనుకోండి. మీరంత మీరు చెయ్యిని విరవలేరు. చాలా కష్టం కదూ విరవటం. అసలు అటువంటి పని అసాధ్యం అనవచ్చు. బలమైన మనిషి రెండుసార్లు అటూ ఇటూ త్రిప్పితే చేయి ఏమవుతుంది. ఫట్టుక్కున విరిగి పోతుంది. అంత బలమైన మనిషి సద్గురువు. మహా శక్తి వంతుడు, మనస్సుని నడిపించగలవాడు సద్గురువు. మనస్సు చేసే దౌష్ట్యాన్ని అణచగలవాడు సద్గురువే.

అయితే, సద్గురువు వో పట్టాన దొరకడు. సద్గురు దర్శనం కావాలంటే భగవత్ప్రేమలో మునిగితేలాలి. ఆటుపోటలకి తట్టుకొంటూ కృంగికృశించి పోకుండా సత్యాన్వేషణ చేయగలగాలి. అప్పుడే, ఈ రెండు లక్షణాలు- భగవత్ప్రేమ, పట్టువదలని సత్యాన్వేషణ, సద్గురువుని రప్పిస్తాయి. ఎవరి మనస్సునైనా నొప్పించారనుకోండి. అందువల్ల అతగాడికి ఎంతో మేలు జరిగే పక్షంలో మీ కటికితనం కూడా దీవెన క్రింద లెక్కే. అందువల్ల తప్పులేదు. మేలు చేద్దామనుకొని మనస్సుకి తీరని గాయం చేస్తే మాత్రం అది మేలు కాదు. సరికదా శాపంగా మారుతుంది.

ఇంకో ఉదాహరణ చెప్తాను. వో డాక్టరుగారున్నారు. ఆయన దగ్గరకి రోగివచ్చాడు. పెద్ద కురుపు వేసింది. బాగా చీము పట్టింది. డాక్టరుగారు కత్తి పెట్టి కోస్తుంటే ఆ రోగి అయ్యో, కుయ్యో అని అరుస్తున్నాడు. డాక్టరుగారు అతని కేకలు పట్టించుకోలేదు సరికదా గదమాయిస్తూ, చీము అంతా తీసేసి, పుండు శుభ్రం చేసి కట్టుకట్టాడు. రోగికి నొప్పి తగ్గింది. మరి ఆపరేషన్ చేస్తున్నప్పుడు పడే బాధలో రోగికి డాక్టరు శత్రువులా కనిపిస్తాడు. కానీ పుండుకి మందు రాసి కట్టు కట్టిన డాక్టరు ఏమవుతాడు. నిజమైన స్నేహితుడు. అలాగే సద్గురువు కూడా శత్రువుగానే కన్పిస్తాడు. పాపాలు తొలిగించడానికి కోరికలనూ, సంస్కారాలనూ తుడిచి పెట్టడానికీ నియమ నిష్టలు చెప్పిన, విరాగిగా వుండమన్నా సద్గురువు మాటలు నచ్చవు. పై పెచ్చు సుఖాన వున్న ప్రాణాన్ని కష్టపెడ్తున్నాడని ఆయన్ని శత్రువుగా చూస్తారు. మరి ఆ సద్గురువు కృపవల్ల బ్రహ్మైక్య వరం లభిస్తే ఇంకేం కావాలి. ఆ శత్రువే పరమమిత్రుడుగా కనిపిస్తాడు అంటూ సద్గురువుల విశిష్టతని బాబా మండలివారికి తెలిపారు.





మెహెరాబాద్‌లో ప్రేమాశ్రమం వెలిసింది. అది 1927 డిసెంబరు నెలలో. అది ఎలా జరిగింది అంటే......, బాబావారి ప్రేమామృత ప్రభావం కొంతమంది ఆశ్రమం పిల్లలపై బాగా పడింది. వీళ్ళని విడిగా వుంచాలని డిసెంబరు 10వ తేదీన నిర్ణయించారు. వీళ్ళు దృష్టి చదువుపై కంటే, ధ్యానం పైనే ఎక్కువగా వుంది. సాధ్యమైనంతసేపు భగవన్నామస్మరణ చేస్తూ వుండాలన్నది వాళ్ళ అభిమతం. ఈ పిల్లల ఆలనాపాలనా చూసే బాధ్యతని బాబా రావ్ సాహెబ్‌కి అప్పగించారు. ధ్యానంలో పడివీళ్ళు తిండిసరిగాతినకపోవచ్చు. వాళ్ళు సమయానికి భోజనం చేసేలాచూడు. అలానే పుష్టికరమైన ఆహారం పెట్టించు వీళ్ళకి, అని బాబావారు రావు సాహెబ్‌కి చెప్పారు.

ఈ పిల్లలని ఎక్కడ వుంచాలని కాసేపు తర్జన భర్జన జరిగింది. కొండక్రింద ఇరానీ పిల్లలతో వీళ్ళని వుంచాలని నిశ్చయించారు. అయితే, ఐదు రోజులు తిరగకుండానే వాళ్ళని కొండపైకి రప్పించారు. మెహెరాబాద్ కొండపైనే బాబావారు వుంటున్నారు కదా అందువల్ల వీళ్ళు ఇహపైన బాబావారి కనుసన్నల్లో వుండగలుగుతారన్నమాట. ఇలా, ఈ ప్రకారంగా ప్రేమాశ్రమానికి నాందీ ప్రస్తావన జరిగింది.

మెహెరాశ్రమం ఎప్పటిలానే కొనసాగుతోంది. అక్కడి పిల్లలపైన కూడా బాబావారి ప్రభావం పడుతోంది. ప్రేమాశ్రమం పిల్లల మాదిరిగా వీళ్ళుకూడా అప్పుడప్పుడు ప్రేమలో మునిగి తేలుతూ కనిపిస్తున్నారు. అయితే వీళ్ళకి ధ్యానంపైన కంటే, చదువులపైనే ధ్యాస ఎక్కువ అంటే అతిశయోక్తికాదు. అందువల్లనే కామోసు, బాబావారు వీళ్ళని ప్రేమాశ్రమం పిల్లలకి దూరంగా వుంచారు.

డిసెంబరు 15వ తేదీన బాబావారు క్షుద్రవిద్యల గురించి క్షుద్రశక్తుల గురించి, ప్రేతాత్మల శక్తి గురించి వివరించారు.

ఆవేళ అందరూ షాహనే మామయ్య ఇంటికి వెళ్లారు. రుస్తుం పేపరు తెచ్చాడు. ఇందులో వొకవార్త ఆసక్తికరంగా వుందని అన్నాడు. లోహపు ముక్కని పాముగా మార్చాడట వో ప్రభుద్ధుడు. ఆ వార్త చదివి వినిపించాడు.

బాబావారు చిరునవ్వు నవ్వారు. ఇలా స్పందించారు.

లోహపు ముక్కని పాముగా మార్చటం క్షుద్రవిద్య. ఇదేమీ ఘనకార్యంకాదు. అటువంటివాళ్ళ ప్రభావంలో పడకండి. క్షుద్ర శక్తుల వెనకపడ్డవాళ్ళు భగవన్మార్గానికి దూరం అవుతారు. చెడ్డ సంస్కారాలు వాళ్ళ సొంతం అవుతాయి. ఈ చెడ్డ సంస్కారాలు వాళ్ళని భగవన్మార్గంలో ముందుకు వెళ్ళనీకుండా అడ్డుకొంటాయి. దారుణమైన పాపాలు చేసినా చెడ్డ సంస్కారాలు సంక్రమిస్తాయి. వాటికంటే భయంకరమైనవి క్షుద్రశక్తులు తెచ్చే సంస్కారాలు అని బాబా వెల్లడించారు.

క్షుద్రశక్తులు ఎలా లభిస్తాయో వివరించారు. క్షుద్రపూజలు చేసే వారు రకరకాల జుగుప్సాకరమైన సాధనలు చేస్తారన్నారు. కొందరు రక్తం త్రాగుతారుట. ఇంకొందరు మలాన్ని భోజనంగా స్వీకరిస్తారుట. చాలా గట్టి సాధనం చేస్తేనే కానీ క్షుద్రశక్తులు లభించవని చెప్పారు. తాంత్రిక విద్యలవల్ల వచ్చే శక్తికూడా గొప్పదే. కానీ వీటివల్ల, ఉపాసకుడు తన శరీరాన్ని పెద్దది చేయగలడు. చీమకంటే చిన్నదీ చేయగలడు. చీమగా మారిన కాసేపటికే మనిషి రూపంలో నిలబడగలడు. శరీరాన్ని ఎలా మార్చినా, అతగాడి సంస్కారాలు వెన్నంటి వుంటాయి. చీమగా మారినా అవి మాయం కావు అని కూడా బాబావారు వివరించారు. ప్రేతాత్మలు, వాటి శక్తుల గురించి మాట్లాడుతూ, క్షుద్రశక్తులకీ ప్రేతాత్మల శక్తులకీ తేడా వుందన్నారు. ఇవి రెండూ ఒకటి కాదని చెప్పారు. ఆత్మహత్యకి పాల్పడినివారు భూతాలుగా తిరుగుతారు. విముక్తి లభించేవరకు వాళ్ళకీ తిప్పలు తప్పవు. ప్రేతాత్మలోను ఆత్మ వుంది కదా. మరి ఆత్మకీ శక్తి వుంటుంది. అది సహజశక్తి. క్షుద్ర పూజలతో వచ్చే శక్తి వేరు. అయినా క్షుద్రపూజలు, క్షుద్ర శక్తులగురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది అన్నారు.

భూతాలకి శరీరంలేదు. ఎవరి శరీరంలోనైనా అవి దూరతాయి. వాళ్ళను కొన్నట్లు ఆ శరీరాలచేత చేయిస్తాయి, అని బాబా వారు పేర్కొన్నారు. శక్తులు సంపాదించిన వాళ్ళు ఇలా చేయలేరని చెప్పారు. వాళ్ళు కేవలం శరీరాన్ని పెద్దదిగనో, చిన్నదిగనో, వాళ్ళ అవసరాలని బట్టి మార్చగలుగుతారు. అంతకుమించి ఏమీ చేయలేరు. ఇందువల్లనే వాళ్ళ శారీరక సంస్కారాలు వాళ్లని వెన్నంటి వుంటాయి. వదిలిపెట్టవు ఎప్పుడూ అని వివరించారు. శరీరాన్ని చిన్నదిగా మార్చటం వల్ల చిక్కులు వున్నాయని హెచ్చరించారు. ఎవరి కాలిక్రిందయినా పడి నలిగిపోవచ్చు అన్నారు. ఇంద్రజాలం, వశీకరణ మంత్రం, మంత్రవిద్యలు కోసం నానా అవస్థలు పడాలి. అంతకష్టపడి ఆ శక్తులు సంపాదించితే, వొరిగేది ఏముంది. భయంకరమైన సంస్కారాలు తప్ప, అంటూ పెదవి విరిచారు బాబా.

మనదేశంలో మాదిరిగా విదేశాల్లో కూడా భగవదన్మత్తులున్నారా? గురువులు, సద్గురువులు వున్నారు? ఈ ప్రశ్నకి బాబా డిసెంబరు 17వ తేదీన జవాబు ఇచ్చారు.

పరమాత్మానుభవం పొందిన ముగ్గురు పర్షియా (ఇప్పటి ఇరాన్)లో వున్నారని బాబా అన్నారు. ఈజిప్టులో అటువంటి అసాధారణ వ్యక్తి వొకరున్నారు. మూడు- నాలుగు భూమికల మధ్యవున్న ఉత్తముడు వొకరు లండను మహానగరంలో వున్నారు. నా ఆదేశాలకి స్పందిస్తాడు. నేనతని గురువుని. కానీ ఆ వైనం తెలీదు అతనికి. ఇతగాడికంటే బాగా ముందుకువెళ్ళిన సాధకుడు వొకరు అమెరికాలో వున్నాడు. నేనే తన గురువునని అతనికి తెలుసు, అని బాబావారు తెలియజేశారు. గోపాలస్వామి, మనేకర్‌లు సాధక ఆశ్రమంలో ఏకాంతంగా వుంటున్నారు. డిసెంబరు 18 నాటికి వీళ్ళ ఏకాంతవాసం





మొదలయి పదహారు రోజులయింది. ఆవేళ వీరిద్దరికీ, కళ్ళు మిరుమెట్లు గొల్పే బ్రహ్మాండమైన వెలుతురు కనిపించింది. ధన్యోస్మి అనుకొన్నారు ఇద్దరూ.

మెహెరాబాద్‌కి వచ్చి ఎంతమంచి పని చేసేనో అనుకొన్నాడు మనేకర్. అతగాడు ముందు గాంధీమహాత్ముని దగ్గరకి వెళ్ళాడు. మహాత్ముని నీడన చాలాకాలం పాటు వున్నాడు. సత్యాన్వేషణలో అక్కడ ఫలితం కనపడక బాబా సన్నిధికి వచ్చాడు. ఇప్పుడు ఆ దివ్యానుభూతితో మనస్సు పులకించింది. బాబా దగ్గర తన శేష జీవితం అంకితం చేయాలనుకొన్నాడు.

డిసెంబరు 19న గుస్తాద్‌జీ అన్న సొహరాబ్‌ద హన్సోటియా మెహెరాబాద్ వచ్చాడు. గొయ్యిగది ప్రక్కనవున్న రెండుగదుల్లో అన్ననీ, తమ్ముడినీ వుండమన్నారు బాబా. ఈ రెండు గదులు శాశ్వత ప్రాతిపదికిన కట్టినవి కావు. ఏదో తాత్కాలిక అవసరాలకోసం కట్టారు. గుస్తాద్‌జీకి బాబా ప్రతిపాదననచ్చింది. ఇప్పటి వరకూ అతను జోపిడీ వరండాపైన పడుకొంటున్నారు. జోపిడీ చుట్టూరా వేసిన పూలతోటకి తోటమాలిపని చేస్తున్నాడు. ఇప్పుడీపనిని మాసాజీకి అప్పగించారు.

బాబా ఉపవాస దీక్షలో వున్న సంగతి పాఠకులకి గుర్తుందికదా. డిసెంబరు 20వ తేదీ బాబా ఉపవాస దీక్షపట్టి 41వ రోజు. ఆ వేళ సంబరం చేశారు. లాగుడు రిక్షాలో బాబాని కొండపైకి తీసుకువెళ్ళారు. ఆవేల్టి నుంచీ, బాబా రాత్రిళ్లు తన సమాధి గది గొయ్యిలో పడుకొంటున్నారు. పగలు ఆ గదిలోనే కూర్చొంటున్నారు. బయటికి వస్తే వొట్టు. అలా గొయ్యిగదిలో రెండునెలల ఎనిమిదిరోజులున్నారు. రోజుకోసారి కాస్తంత కాఫీ త్రాగేవారు. ఇంకేమీ తీసుకొనే వారుకాదు. దీక్షముగిసే సమయానికి కాఫీకూడా మానేశారు. ఎప్పుడయినా కాసిని మంచినీళ్ళు తీసుకొనేవారు.

ఇంతకఠోర ఉపవాసదీక్ష ఎందుకో బాబావారు చెప్పలేదు. మండలివారు ప్రశ్నించేసాహసం కూడా చేయలేదు. బాబా ఉవాచ వినటం, బాబా ఆదేశాల్ని పాటించడం తప్పమరొకపని తెలీదు మండలివారికి. వో రోజు రాత్రి బాబా వారికి మరణం గురించి చెప్పారు.

**-సశేషం**

# మెహెర్ ప్రేమికుల మెగా డైరీ

మెహెర్‌బాబా ప్రేమికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా రూపొందించిన మెగా డైరీని నవంబరు 14 న జూబ్లీ బాబా సెంటర్ వార్షికోత్సవంలో విడుదల చేయనున్నామని, మెగా డైరీని సంకలనం చేసిన శ్రీ బి. క్రిష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సెంటర్ల బాబా ప్రేమికులు ఆనాటి కార్యక్రమానికి హాజరైనట్లయితే డైరీ ప్రతులు ఉచితంగా అందజేయడానికు వీలుగా వుంటుందని ఆయన అన్నారు.

*(గత సంచిక తరువాయి)*

# బాబా ప్రేమ అందరి సొత్తు

**భావూజీ అమెరికానుండి వచ్చాక మెహెరాబాద్‌లో బాబా సమాధిని దర్శించకుని, అవతారునితో తనకు జరిగిన అనుభూతిని ఇటీవల పిలిగ్రిం సెంటర్‌లో వివరించారు. ఆ సమయంలో అక్కడేవున్న శ్రీ మల్లాది రామారావు, న్యూ ఢిల్లీ, తెలుగు బాబా ప్రేమికులకోసం ప్రత్యేకంగా రాసి పంపిన భావూ మాటలను యధాతథంగా ప్రచురిస్తున్నాం. ఆస్వాదించండి. -ఎడిటర్.**

**గ**తములో ఒకసారి మేము బొంబాయిలో వుండగా ఇలానే బాబావారి కళ్ళు చెమర్చాయి. అది 1957 అక్టోబరు నెల. అహ్మద్‌నగర్ నుంచి ఆదీ. కె. ఇరానీ, బాబా కార్యదర్శి, ఫోను చేశాడు. గుస్తాద్‌జీ ఈ ఉదయం కన్నుమూశారని చెప్పాడు. ఆ మాట వినగానే బాబావారి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. మూడు నిముషాలు స్థబ్దుగా వుండిపోయారు. గుస్తాద్‌జీ నా ప్రాణమిత్రుడు. నాతో పాటు మౌనం వున్న ఇష్ట సఖుడు.

శరీరం వదిలేటప్పుడు నా నిజస్వరూపాన్ని దర్శించిన ధన్యుడు అన్నారు. అది అప్పటి మాట. బాబా సశరీరులు వున్ననాటి సంగతి.

సమాధి నుంచి ఆరున్నరకు నగర్‌కి వెళ్ళాను. అక్కడా ఇంకా అందరూ నిద్రమత్తులోనే వున్నారు. ఎవర్నీ లేపకుండా నా గదికి వెళ్ళి పనికి కూర్చున్నాను. చాలా ఈ-మెయిల్స్ నాకోసం ఎదురు చూస్తున్నాయి. వాటికి జవాబులు ఇస్తుంటే మెహెర్‌నాథ్ వుత్తరాలకట్ట పుచ్చుకొని వచ్చాడు, మధ్యాహ్నం కాసేపు రెస్టు తీసుకొని సాయంత్రం ఆరింటి వరకూ మళ్ళీ పనిచేసాను. ఆరున్నరనుంచి పదకొండింటి వరకూ జీ-టీవి కార్యక్రమాలు చూసి నడుం వాల్చాను. భలే నిద్రపట్టింది. ఇలా ఎప్పుడూ పడుకోలేదు. ఆదమరచి నిద్ర పోయాను.

మర్నాడు తెల్లవారు ఝామునే మెలుకువ వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి, ఆరున్నరకల్లా ఆఫీసులో కూర్చొన్నాను. మళ్ళీ కొత్తగా ఈ-మెయిల్స్ రావులే అనుకొన్నాను. కాని 19 మెయిల్స్‌లు నాకోసం ఎదురు చూస్తున్నాయి. పాతవి పేరుకుపోయి వున్నాయి. అవి సరేసరి. వొకరోజా రెండురోజులా, మూడునెలల బకాయి. ఇంటర్నెట్‌కి ఇబ్బంది లేదు. పని చురుకుగా జరిగి పోయింది. అయితే ఇంటర్నెట్టు మాటిమాటికి కూలబడి విసుగు తెప్పించింది. ముందు నిర్ధారించిన ప్రకారమయితే నేను జూలై17వ తేదీ కల్లా మెహెరాబాద్‌కు వస్తానని అమెరికావెళ్ళేముందు అందరికీ చెప్పాను. మరి అలాకాకుండా 15వ తేదీకి నగరుకి వచ్చేశాను. ఈ విషయంతెలిసి ఒక్కొక్కరే వచ్చి కుశల ప్రశ్నలు వేశారు. మంగళవారం మెహెరాబాద్‌కి వెళ్ళాను. బాబావార కుర్చీదగ్గరకి సరాసరి వెళ్ళాను.





ప్రియతమునికి ప్రణమిల్లాను. బాబా మహదానందంగా కనిపించారు. చిరునవ్వులు చిందిస్తున్నారు. అందర్నీ రమ్మని పిలిచాను. వెంటనే వచ్చారు. అంతాకలిసి, బాబా ప్రార్థనలు చేసేము. బాబా పడక గదికి వెళ్ళాము. ఆ గది నాకు కొత్త అయితే కదా. అక్కడ ఎన్ని రాత్రుళ్ళు నైట్ వాచ్‌మన్‌గా వున్నానో నేను. బాబా కేసి చూశాను. మండలి హాలులోలాగా ఇక్కడ కూడా బాబా చిరునవ్వు చిందిస్తున్నారు. ఎంతో సంతోషం, మరెంతో వుల్లాసంగా కన్పించారు ఆయన దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు. అక్కడ కొండపైన సమాధిలో ఒకలా వున్నారు. ఇక్కడ ఇంకోలా దర్శనమిచ్చారు. అక్కడ మనందరి కోసం బాధపడ్తున్నట్లు కన్పిస్తే, ఇక్కడ మెహెరాబాద్‌లో నవ్వుతూ, సరదాగా దర్శనమిస్తున్నారు. ఏమిటో ఈయన. ఆగస్టు 12న ధుని రోజున ఏమవుతుందోచూడాలి. ఆ రోజుకి మెహెరాబాద్‌కి ధుని కార్యక్రమం కోసం వెడతాను. పశ్చిమ దేశాలు ప్రేమికులు అప్పగించిన సంస్కారాల మూటని ధునిలో వేస్తాను. 'బాబా, వీరి సంస్కారాలని మసిచేసేయమని' ప్రార్థిస్తాను. అప్పుడు నా బరువు భారం తగ్గుతుంది. నా విధి పూర్తయినట్లవుతుంది. అలా అని, బాబా విధి ముగుస్తుందనికాదు. ఆ సర్వాంతర్యామి సర్వకాల సర్వావస్థల్లో మనల్ని అందర్నీ తన దగ్గరకు రప్పిస్తున్నది బాబాగారే. ఎలా మనల్ని రప్పిస్తున్నాడో వో పట్టాన అంతుపట్టదు. అదంతా గమ్మతు గమ్మత్తుగా జరుగుతుంది. మనమేనా బాబా దగ్గరికి రాగలిగింది అని ఆశ్చర్య పోవటమే మనవొంతు. శరీరం వదిలి పెట్టాక బాబా చాలా యాక్టివ్ అయ్యారనాలి. అవతార వ్యక్తీకరణ విశ్వవ్యాప్తంగా జరగటానికి ఇంకా కొంత టైం వుంది. అప్పటి వరకూ బాబా చాలా బిజీగా వుంటారు. విశ్వ అవతార వ్యక్తీకరణ జరిగాక పని చేయరనికాదు. అప్పుడూ పని చేస్తారు. కానీ కాస్తంత విశ్రాంతిని అడపా దడపా తీసుకొంటారు.

మీకో మాట చెప్పనా! సమాధికి వెళ్ళండి. ప్రియతమునికి ప్రణమిల్లండి. అంతే. ఇంకేమి చేయనక్కర్లేదు. మీ గుండెలపై భారాన్ని తీసేస్తాడు. తనపై వేసుకొంటాడు. కనురెప్పపాటులో జరుగుతుంది ఇదంతా. మీకు తెలియనే తెలియదు. మనమెంత అదృష్టవంతులమో కదూ. పరాత్పరుని సాంగత్యంలోకి వచ్చాము.

ప్రియతముని వెంట నడుస్తున్నాము. ఎంతగొప్ప వరమో కదా ఇది. బాబాపట్ల మీ ప్రేమకు ఇదే నా జోహార్లు. జయహో! జయహో! జయహో!.

## విజ్ఞప్తి

మెహెర్‌బాబా పత్రికకు వార్షిక చందా రూ. 100/- లేదా జీవిత సభ్యత్వం రూ. 1000/- చెల్లించండి. పత్రిక పురోభివృద్ధికి సహకరించండి. మా అడ్రస్సు ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500 087 ఫోన్: 99595-53218

(గత సంచిక తరువాయి)

# ప్రార్థనలు - పూజలు

*మూలం: లార్డ్‌మెహెర్* *సేకరణ: బి. వాసుదేవ్‌రావు*

**ఎ**ందుకంటే అవి హృదయంలేని ఒట్టి శబ్దధ్వనులు. ఆలాంటి శుష్కమైన, పసలేని ప్రార్థనలు ఎంత గట్టిగా ఉచ్చరించినా, ఎంత పొడుగున సంవత్సరాల తరబడి చేసినా, నా పైన ఏలాంటి ప్రభావము వుండదు. ఇందుకు బదులు ఎవరైతే నిజాయితీతో దేవుని- నన్ను- వేడుకుంటారో, వారు ఎంత దూరములో నున్నప్పటికి వారి వేదన ఎంత మెల్లగా, సరళంగా ఉన్నప్పటికి, నేను భగవంతునిగా తక్షణమే వింటాను. వారితో సంబంధమేర్పరచుకుంటాను.

ఉదాహరణకి, చాలా దూరంలో నున్న టెలిఫోను స్టేషన్‌ను తీసికొండి. దీనికి ఇతర టెలిఫోన్లు కలపబడతాయి. మనకు కావలసిన నంబర్లు కలపగానే కనెక్షనివ్వబడుతుంది. ఈ రకంగానే సద్గురువు మానవాళికి కేంద్రమైన ముఖ్యస్టేషను. ఎవరైనా ఎంత దూరములో నున్నప్పటికి నిజాయితీగా, హృదయపూర్వకంగా తలచుకుంటే, వారి వేదన అతనికి వినిపిస్తుంది. భారమనే ప్రశ్నేలేదు. అతను ప్రతివారికి సమాన దూరంలో నున్న కేంద్రబిందువు. ఆయన ఈ మాదిరి కేంద్రముగ- ఈ ప్రపంచానికే గాకుండా, సృష్టికంతటికి, ముల్లోకాలల్లోని, వివిధ భూమికలతో గూడా సహాయభూతుడౌతాడు.

కాని, ఏకకాలంలో అందరి ప్రార్థలను వినడం ఎలా సాధ్యం? లక్షలాదిమంది ప్రార్థనలు, పిలుపులు సద్గురువుతో అనుసంధానము కావడం ఎలా? దీని జవాబు చాలా తేలిక. సద్గురువంటే ఎవరు? అనంతమైన అపరిమితమైన శక్తుల నుపయోగింపగల పాలకుడు. అతనికి, ఒకటా? ఇరువైఒకటా? వెయ్యా? లక్షా? కోట్లా? అనే ప్రశ్నేలేదు. అతని దృష్టిలో అందరూ సమానమే. కానీ, నీ పిలుపు హృదయాంతరాళం నుండి రావలెను. ఆర్థతనుండవలె. అప్పుడది దూరాభారానికి గాని- రద్దీకిగాని ప్రమేయం లేకుండా అతని చెవికి చేరుతుంది.

హృదయం నుండి రాని అన్ని పిలుపులు, ప్రార్థనలు ఒట్టి భేషజాలు మాత్రమే- లేదా ఆలాంటి ప్రార్థనలు ఎంత పొడుగున గొంతెత్తి చేసినా నిరర్థకాలు. ఇంతకంటే అధమం తమ ప్రార్థనలను, బ్రాహ్మణుల, దస్తూర్‌ల, మౌల్వీల మరియు ప్రీస్టులకు బాడుగ ఇచ్చి, దేవునికి నివేదించుకోవడం. ఇందు ధంభము తప్ప మరేమి లేదు.

ఒకరు బాబాను ప్రశ్నించారు. "బాబా, సమయాభావం వల్ల ప్రార్థనలు, స్వతహాగ





చేసుకోలేని పక్షాన, అర్పణ భావంతో ఇతర మార్గాల ద్వారా చేయించుకోవడం" తప్పా? అని అడిగారు.

ఇందుకు జవాబుగా బాబా ఇలా చెప్పారు - "ఇంతకంటే తెలివిహీనత, మూర్ఖత్వం వేరే లేదు. ఇది ఒక నెపము. పనికిరాని నటన. నిస్తేజము- ఆత్మన్యూనత. భగవంతునికి ఎప్పుడైనా కిరాయి ప్రార్థనలు, పూజలు-పునస్కారాలు చేయించగలమా? ఇది ఊహ కందనిది. ఇంకా మాయకు ఎరగా నిల్చి, తన కర్మభారాన్ని, ఇతరుల భుజాలపై నెట్టుతూ, డబ్బు కూడా ఇస్తూ, తనను భగవంతుని దగ్గరకు చేర్చమని కోరడం విడ్డూరంగా వుంటుంది. ఇదొక మాయాజాలపు విషవలయం.

మరొకరంటారు -- " భగవంతుడ్ని ప్రార్థించడానికి నాకు టైం లేదంటారు! ఎందుకట? ఎందుకంటే, భగవంతుడిని ప్రార్థించడం కోసం ప్రత్యేకంగా టైం కేటాయించడానికి ఇష్టం లేదంటాడు. తనకెన్నో చేయవలసిన పనులున్నాయంటారు. ఐతే, సమయంలేదని చెప్పుకోవడం అర్థరహితం. మాయ అనే బోనులో మనస్సు చిక్కుకున్నప్పుడు - అందులోంచి బయటపడడానికి ఇష్టపడదు. అందువల్ల ఇతరులచేత అంటే పూజారులచేత ప్రార్థనలను, అర్చనలను చేయిస్తారు. దీనివల్ల ఎలాంటి ఫలితం ఉండదు.

భగవంతుడిని ప్రార్థించాలంటే నిజాయితీ అవసరం. హృదయపూర్వక అర్పణ భావం ప్రధానం. భక్తి లేకుండా గంటలకొద్దీ చేసే పూజలు, ప్రార్థనలవల్ల లాభం శూన్యం.

కొద్దినిమిషాలపాటు చేసినా మనసావాచా నిజాయితీతో ఎలాంటి డాంభికాలులేని ప్రార్థనలను, పూజలను భగవంతుడు హర్షిస్తాడు అని మెహెర్‌బాబా అన్నారు. ❋

# శ్రీనయ్యగారి పాటలు

శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం మెహెర్‌బాబాపై అనేక పాటలు, గీతాలు స్వయంగా రాసి రసవత్తరంగా ఆలాపించారు. భావితరాలవారికోసం వారి కీర్తనలను ఒక చిన్న పుస్తక రూపంలో ప్రచురించవలసిన అవసరం ఎంతో ఉంది. అలాగే ఆడియో, సిడిలలో ఆధునిక రీతిలో రికార్డింగ్ చేయవలసిన అవసరం ఎంతో ఉందని బాబా ప్రేమికులు శ్రీ మాదిరాజు సీతారామస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏదేని బాబా సెంటర్ లేదా బాబా ప్రేమికులు స్వచ్ఛందంగా చేపట్టి సహకరించవలసిందిగా శ్రీ సీతారామ స్వామి అన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ శ్రీనివాసరావు, ఫోన్ నెం. 9298952785, 08942-225947 సంప్రదించవలసిందని ఆయన కోరారు.

మామాటలు

# నమో భక్తః ప్రణశ్యతి

**అ**వతారుని సేవలో తరించి, ధన్యులైన ఓ 50 మంది విశేష జీవనరేఖాచిత్రాలతో కూడిన ఒక చక్కని గ్రంధాన్ని **నమో భక్తః ప్రణశ్యతి** పేరిట – మెహెర్‌బాబా మాసపత్రిక రూపొందించింది. పలువురు బాబా ప్రేమికులు అవతారుని సన్నిధిలో గడిపిన సమాచారాన్ని నేరుగా వారితో ఇంటర్వ్యూలు జరిపి గత ఐదారేళ్ళుగా మెహెర్‌బాబా మాసపత్రికలో దాదాపు ప్రతినెలా ప్రచురిస్తూ వచ్చిన సంగతి బాబా ప్రేమికులందరికీ తెలుసు. భవిష్యత్తులో పలువురి బాబా ప్రేమికులకు, ముఖ్యంగా యువతరానికి ఉపయోగపడేలా ఆ ఇంటర్వ్యూలన్నింటినీ గ్రంధస్తం చేయడమైంది. సుమారు 400 పుటలతో త్వరలో మీ ముందుకు రానున్న ఈ గ్రంధాన్ని ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆస్వాదించగలరు..

ఈ పుస్తకంలో ప్రచురించనున్న బాబా ప్రేమికులు, పుస్తక విడుదలకు సంబందించిన వివరాలు రాబోయే సంచికలో అందించగలం..... **సంపాదకులు, మల్లాది కృష్ణానంద్.**

## శ్రీ చిలుకూరి సత్యనారాయణ



మెహెర్‌బాబా ప్రేమికులు, శ్రీ చిలుకూరి సత్యనారాయణ, కాకినాడ వాస్తవ్యులు బాబా నామజపంతో 2009 జూన్ తొమ్మిదిన బాబాలో ఐక్యమొందారు. ఆయన తన వ్యాపార లావాదేవీల్లో ఎంత తలమునకలవుతున్నా బాబావారి కార్యక్రమాలకు తప్పక హాజరయ్యేవారని ఆయన దగ్గరి బంధువులు, స్నేహితులు చెప్పారు. క్రమంతప్పకుండా అవతారుని అమరతిథికి తనను మెహెరాబాద్‌కు ప్రతి సంవత్సరం పంపే ఏర్పాట్లు తన పెద్ద కొడుకు శ్రీ సత్య న్నారాయణ చేసేవాడని వీరి తల్లి శ్రీమతి చిలుకూరి సత్యవతి అన్నారు. అందరితో ఎంతో ప్రేమగావుండేవాడని ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని బంధువులు, సోదరులు, స్నేహితులు ఒక ప్రకటనలో కోరారు.

## ఆంధ్రా రెస్ట్‌హౌస్, మెహెరాబాద్

**ఫోన్: 0241- 2548544**

ఆంధ్రా రెస్ట్‌హౌస్‌లో భోజన వసతిలకోసం రోజు మొత్తానికి రూ. 70 /- చొప్పున వసూలు చేయాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మొత్తంలో – భోజనం (లంచ్ & డిన్నర్), టీ (ఉ. 6-6.30), తిరిగి బ్రేక్‌ఫాస్ట్ & టీ (ఉ.8-9) లభిస్తాయి.





# తెలుగువారి అతిథిగృహం

**మె**హెరాబాద్‌లో నిర్మించిన తెలుగువారి అతిథిగృహంలో మొదటి అంతస్థు పనులు 2009 డిశంబరు నాటికి పూర్తి చేయాలని సంకల్పించినట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివలన సుమారు 150 మందికి బస ఏర్పాటుకు వీలవుతుంది. ప్రస్తుత నిర్మాణంలో కేవలం 30 మందికి మాత్రమే వసతి కల్పించడమౌతోంది. మొదటి అంతస్థు పూర్తయాక రెండవ అంతస్థులో అన్ని హంగులతో కూడిన ఎనిమిది కాటేజీల నిర్మాణం చేపట్టనున్నామని ఆయన అన్నారు. ఈ నిర్మాణపు పనులకై విరాళంగా బాబా ప్రేమికులు వారి శక్త్యానుశారం వస్తు లేదా నగదు రూపంలో సహకరించాలని శ్రీ రావు కోరారు. రూ. 25,000/- ఆ పైన విరాళం ఇచ్చినవారికి జీవిత సభ్యులుగా నమోదు చేసుకొని ఇక్కడి బస ఏర్పాటులో అధిక ప్రాధాన్యత ఇవ్వడమౌతుందని తెలిపారు. రెండవ అంతస్థులో కాటేజీల నిర్మాణం కోసం ఒక్కొక్క దానికి రూ. 3 లక్షలు ఖర్చు కాగలదు.

మొదటి అంతస్థు నిర్మాణానికై సుమారు 15 లక్షలు ఖర్చు కాగలదని అంచనా. నేటి వరకూ చేపట్టిన పనులకై సుమారు రూ. 13 లక్షలు రుణం చేయడమైందని ఆయన వివరించారు.

తెలుగువారికోసం ఎన్నో ప్రయాసలకోర్చి చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక అతిథి గృహ నిర్మాణం అన్ని విధాల ప్రతిపాదించిన రీతిలో సకాలంలో పూర్తయ్యేలా అవతారుని ప్రేమికులందరూ వారి స్థోమతను బట్టి సహకరించి నిర్మాణపు పనులలో భాగస్వాములు కావాలని, బాబా ప్రేమికులందరినీ పేరుపేరునా విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు.

**మరిన్ని వివరాలకు శ్రీ వై. యస్. రావ్ ఫోన్ – 09011751910, 0241- 2548937 సంప్రదించగలరు.**

## కావలెను

అతిథిగృహంలో **1) వాచ్‌మెన్ 2) స్వీపర్ 3) వంటవాళ్ళు** పనిచేసేందుకు ఇష్టపడితే వారు తక్షణం తమ ధరఖాస్తులను శ్రీ వై.ఎస్.రావ్ మెహెరాబాద్‌కు పంపుకోగలరు. ఎంపికయినవారికి భోజన, బస ఏర్పాట్లు రెస్ట్‌హౌస్ ప్రాంగణంలోనే ఉచితంగా అందజేయగలరు. తగిన నెలవారీ పారితోషికం అందజేయగలరు. వాలంటరీగా సేవలు అందజేసేందుకు ముందుకువచ్చే బాబా ప్రేమికులూ తమ వివరాలు పంపాలని ఆయన కోరారు.

# భ్రమరాంబ బాబాలో ఐక్యం



శ్రీ సన్యాసిరాజు, విజయనగరంగారి భార్య శ్రీమతి భ్రమరాంబ (64) అకస్మాత్తుగా తీవ్ర గుండెపోటుతో 2009 ఆగష్టు మూడవతేదీన బాబాలో లీనమయ్యారు. ఆమె ఛాతీలో నొప్పితో బాధపడుతుంటే తమ దగ్గర్లోని ఆసుపత్రికి బాబా నామజపంచేస్తూ తీసుకెళ్ళానని బాబా నామం వింటూనే ఆమె అవతారునిలో లీనమయ్యారని శ్రీ సన్యాసిరాజు తెలిపారు. ఆమె సంస్మరనార్థం బాబా ప్రేమిక సహవాస్, విశాఖపట్నంలో ఆగష్టు 14న ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతి శర్మ, శ్రీ సి.వై.చింతామణి, శ్రీ అఘోరపతి, శ్రీ కొల్లి రామారావ్, శ్రీ ప్రకాష్ మెహెర్, తదితరులతోపాటు అనేకమంది ముఖ్యంగా ఉత్తరాంధ్ర బాబా సెంటర్లనుండి విచ్చేసిన బాబా ప్రేమికులు పలువురు పాల్గొన్నారు. జనన - మరణాలపై అవతారుని ప్రవచనాలను బాబా ప్రేమికులు ప్రసంగించారు. శ్రీమతి భ్రమరాంబగారి ఆత్మకు శాంతిచేకూరాలని, శ్రీ సన్యాసిరాజు, వారి కుటుంబసభ్యులకు

# నరసరావుపేట

గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణములో నున్న శ్రీ మెహెర్‌బాబా సెంటర్‌లో శ్రీ మెహెర్‌బాబా విగ్రహావిష్కరణ 14వ వార్షికోత్సవసందర్భముగా శ్రీ బాబా సెంటర్‌లో 10.08.2009 సోమవారం ఉదయం 6.30 నుండి పగలు 11.30 వరకు సామూహిక భజన కార్యక్రమముజరిగినది. ఈ కార్యక్రమమునకు సుమారు 100 మంది ప్రేమికులు హాజరయినారు. బాబా ప్రేమికులైన శ్రీ మంచెళ్ళ కేశవరావుగారు వారి కుమారులతో కలసి వాద్యసహకారముతో మధురముగా పాటలు పాడారు.

మండపేట సెంటర్ అధ్యక్షులు శ్రీ ఎమ్.పనసన్నగారు శ్రీ బాబా సందేశమును వినిపించారు. ఈ వార్షికోత్సవ సందర్భముగా వృద్ధులకు, మోకాళ్ళనొప్పితో బాధపడు ప్రేమికుల ఉపయోగార్థము నరసరావుపేట వాస్తవ్యులు శ్రీ చోరగుడి వెంకటేశ్వరరావు అయిదు (5) కుర్చీలను సేవాభావముతో బహూకరించారు. బాబా ప్రేమికుల సహకారముతో వచ్చిన ప్రేమికులకు బాబా తీర్థప్రసాదములు విశేషముగా యివ్వబడినవి.





# ఆంధ్ర కేంద్రం- నూతన కార్యవర్గం

**అ**వతార్ మెహెర్‌బాబా ఆంధ్ర కేంద్రం అధ్యక్షులు, బి. రామకృష్ణయ్య, 21 సభ్యులతో తమ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన కార్యవర్గం తొలిసారిగా 2009 మే 17న జూబ్లీహిల్స్ బాబా సెంటర్, హైదరాబాద్‌లో సమావేశమైంది. తిరిగి రెండవ సమావేశం 2009 నవంబరు 1న మచిలీపట్నంలో ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు శ్రీ రామక్రిష్ణయ్య తెలిపారు. కాగా, నూతన కార్యవర్గ సభ్యుల వివరాలు ఇలా వున్నాయి.

**అధ్యక్షుడు** : బి. రామకృష్ణయ్య, హైదరాబాద్

**గౌరవ కార్యదర్శి & సలహాదారు** : ఎ.వి. రాఘవులు, విజయవాడ

**ఉపాధ్యక్షులు:** కె.యస్.ఆర్.కె.టి.వి. ప్రసాద్, కొవ్వూరు, సి.వై. చింతామణి, విజయనగరం, జి. రామారావు, విజయవాడ, ఎ. జనార్ధన రావు, నిజామాబాద్.

**కార్యదర్శి:** ఎస్.వి.మెహెర్ ప్రసాద్ రాజు, హైదరాబాద్.

**సంయుక్త కార్యదర్శి & కోశాధికారి** : టి.వి.సుబ్బారావు, హైదరాబాద్

**సంయుక్త కార్యదర్శులు** : పి.వి. రంగప్రసాద్, శ్రీకాకుళం, కె.వి.రత్నం, విశాఖపట్నం, ఆర్. ఎన్.మూర్తి, మండపేట, కె.నారాయణ రావు, రాజమండ్రి, విజయసారథి, తాడేపల్లిగూడెం, హరనాధ్ బాబా, ఏలూరు, కె.సర్వారావు, విజయవాడ, టి మెహెర్‌బాబా, మచిలీపట్నం, ఎ.రామ్ కుమార్, హిందూపూర్, ఆర్. రామచంద్రయ్య, ఖమ్మం, పి.రాజేంద్ర మెహెర్, హైదరాబాద్, రాంచందర్, రామాయంపేట, ఎన్.కిషన్‌రావు, కరీంనగర్

శ్రీ ఎమ్.వి.ఆర్.కె. బాలాజీ, అవతార్ మెహెర్ పత్రిక సంపాదకుడు మరియు సంయుక్త కార్యదర్శి.

# MEHERABAD

## GENERAL INFORMATION

**For Hostel C&D Reservations, Contact**
Jal Dastoor, Hostel C&D Reservations, C/o Avatar Meher Baba Trust,Post Bag No.31, King's road, Ahmednagar- 414001, Maharashtra
**Meher piligrim Retreat:** Phone No.2548211
For MPR reservations, Contact:Piligrim Reservations, Avatar Meher baba Trust, King's Road, Post Bag 31, Ahmednagar -Maharastra 414001, Email: pimco@ambppct.org, Phone 0241-2548733

**ఇది కథ కాదు**

# శ్రీమతి బేల

**ఆ**మె పేరు శ్రీమతి బేల. న్యూ ఢిల్లీ నివాసి. ధనవంతులైనవారి కోడలు.

భర్త పెద్ద వ్యాపారవేత్త. ఆమె తరచు ఢిల్లీలోని బాబా సెంటర్‌కు వస్తుంటారు.

ఇటీవల ఢిల్లీ బాబావారి సెంటర్‌లో ఆమె తన గురించి చెప్పిన ఆసక్తికర విషయాలను మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

ఇకపై అవిడగారి మాటల్లోనే అలకించండి.

**“గొ**ప్పలు చెప్పుకోవడం కాదు గానీ నాకు బాబా చిత్రపటంకేసి చూస్తుంటే.. బాబా నాతో మాట్లాడుతున్నారనే అనుభూతి కలిగేది. బాబా దర్శనం పొందుతున్నాననే ఆనందం నాకు దాదాపు ప్రతి రోజూ లభించేది. తలచుకున్న తడవుగానే అవతారుని దివ్యమంగళ స్వరూపం నా కళ్ళెదుట నిలిచేది. బాబా నాకు చక్కగా నవ్వుతూ దర్శనమిచ్చేవారు. ఈ విషయంలో నాకెప్పుడూ చాలా ఆనందంగా వుండేది.

కానీ అవతారుని ఆ దర్శన భాగ్యం కొన్ని నెలలుగా నాకు దొరకలేదు. ఇటీవల వేసవికి అమెరికా వెళ్ళాను. అక్కడ రెండు నెలలకు పైగా వున్నాను. అక్కడున్న అరవైరోజుల్లో ఒక్కరోజుకూడా అవతారుని దర్శనం దొరకలేదు.

బాబాకు నాపై ఎందుకో కోపం వచ్చింది. నేనేదో తప్పు చేశాను. ఇందుకు క్షమించమని పశ్చాతాపంతో బాబావారిని ప్రతిరోజూ కోరుకున్నాను. ఈ విషయంలోఎంతో మనోవ్యధకు గురయ్యాను. బాబా నాపై కినుక ఎందుకు వహించాడో తెలుసుకోవాలని పరితపించాను. కానీ ఆయన దగ్గరనుంచి ఎలాంటి సమాధానం లేదు.

నేను బాబా పరిధిలోకి నాలుగైదేళ్ళ క్రితమే వచ్చాను. అంతక్రితం మెహెర్‌బాబా గురించి నాకు అంతగా ఏమీ తెలియదు. మా అత్తగారు, ఆమె చిన్నతనంలోనే మెహెర్‌బాబాని దర్శించుకున్నారు. ఆమె మెహెర్‌బాబాను తమ ఇలవేల్పుగా ఆరాధిస్తారు. ఆమె గొప్ప బాబా ప్రేమికురాలు. అలాగే, నా భర్త కూడా.

నేనయితే రాముడు- కృష్ణుని భక్తురాలిని. సాంప్రదాయ రీతిలో పూజలు చేసుకునేదాన్ని. ఆ మధ్య నా కొడుకు డెంగ్యూవ్యాధితో చనిపోయాడు. దాదాపు అప్పట్నుంచే అవతారుని ప్రేమలో నేను సేద తీరుతున్నానని చెప్పగలను. ఆ తీరని బాధను బాబా సన్నిధిలో కొంతమేర మరిచిపోగలిగాను. మెహెరాబాద్‌లోని బాబా సమాధిని తరచు దర్శించుకుంటున్నాను. క్రమేణా మెహెర్‌బాబాను సాక్షాత్తూ భగవంతునిగా ఆరాధించడం మొదలు పెట్టాను. బాబా ప్రేమలో బాధలు మరచి ప్రశాంతంగా, ఆనందంగా





ఉన్నాను. బాబా తన దివ్య దర్శనం నేను కోరినప్పుడల్లా ప్రసాదిస్తున్నారు.

ఇదిలావుంటే గత కొద్ది మాసాలుగా బాబాకు కోపం వచ్చినట్లు , ఎంత రోదించినా, తలబాదుకున్నా ఆయన దర్శనమే కరవైంది.

ఈ విషయమే బాబాని నేను చాలాసార్లు అడిగాను. నాలో ఏమి దోషమని అడిగాను. నేను ఏం తప్పు చేసానని అనేకమార్లు అడిగాను. దేనికీ ఆయన్నుంచి ఎలాంటి జవాబు లేదు. ఏడుపు ఆపుకోవడం దుర్లభమైంది. మనస్సులోని బాధ చెప్పుకోవడానికి చాలా కష్టమనిపించింది. అలాగని కరుణామయుడైన మెహెర్‌బాబా ప్రేమకు దూరంగాను ఉండలేకపోతున్నాను. నా ప్రార్థనలు ఏవీ ఆయన ఆలకించడంలేదనిపించింది.

ఓ రోజున నా మొర అలకించినట్లు నా తప్పిదం ఏమిటో నాకు తెలిసేలా చేసాడు. ఇది నా ప్రశ్నలకు బాబా జవాబిచ్చారనడం కంటే, నేను చేసిన తప్పేమిటో తెలుసుకునేలా చేసారనిపించింది.

ఇటీవల నా అత్తమామలపట్ల అశ్రద్ధగా వున్నాను. వారిద్దరూ 80 ఏళ్ళు పైబడినవారే. వారితో ప్రేమగా మసులుకోవడం నా విధి - బాధ్యతను. అయితే వారెప్పుడు ఈ విషయంలో నాపై ఏలాంటి ఆంక్షలు విధించలేదు. కాగా, గత కొద్ది నెలలుగా నా వ్యాపకంలో బిజీనైపోయి నేను వారిని నిర్లక్ష్యం చేసిన మాట నిజం. ఇది నా మనస్సాక్షికి తెలుసు. బహుశా ఇదే బాబాకు నచ్చలేదని నా మనస్సు సమాధానమిచ్చింది. దాంతో నా ప్రవర్తనలో మార్పు వచ్చింది. నా తల్లి తండ్రులతో సమానమైన అత్తమామలపట్ల ప్రేమతో మసులుకోవడం మొదలెట్టాను. బాబా కరుణించాడు. తిరిగి తన దివ్య ప్రేమ కురిపించడం మొదలెట్టినట్లు నేను భావించాను. తిరిగి నా ఆనందం నా సొంతమైంది. నా హృదయం తేలికైంది.

నేను చేసిన ఈ తప్పిదాన్ని బాబా ప్రేమికులందరి ఎదుట ఒప్పుకొనడం ద్వారా నా మనస్సు మరింత తెలిక పడుతుందని నా వ్యక్తిగత విషయమైనా మీ అందరితో పంచుకుంటున్నానని శ్రీమతి బేల ముగించారు. .........

శ్రీమతి బేలగారి అత్తగారు కూడా ఆనాటి సత్సంగ్‌లో వున్నారు.మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఏనాడు ఏలాంటి నియమ నిబంధనలు, షరతులు విధించలేదు. ఎవరికి వారుగా తమ తప్పిదం తెలుసుకునేలాగా చేశేవారు. శ్రీమతి బేల విషయంలో కూడా అదే జరిగింది.

**కొసమెరుపు**

అత్త మామలనే కాదు, పెద్దలందరి ఎడల గౌరవ మర్యాదలతో వుండాలని, అదే అవతారునికి ప్రీతి అని గమనిద్దాం.

**మల్లాది రామారావ్, ఇండియా ఎడిటర్, ఆసియన్ ట్రిబ్యూన్ వారి సౌజన్యంతో.**

# బాటసారులు

ఇంకొక పర్యాయము ఆజ్మీర్ వెళ్ళినప్పుడు బాబా తన పరివారముతో చాచా గదికి ఇంకోగంటకు తెల్లవారుననగా వెళ్ళిరి. ఈ గది అయిదడుగుల యెత్తునవున్న చిన్నకొట్టము. దానిమీద ఇంకో చిన్న గది ఉన్నది. దానికిగోడ ప్రక్క బయట నుంచి మెట్లున్నవి. ఒక మనిషి సులభంగా పైకి చేరుటకు వీలుగా నున్నవి. ఈ పై గదిలో చాచా యొక్క ముజావర్ (పరిచారకుడు) నివసించుచుండును. వాడు చాచాకి కావలసిన ఆహారము వగైరా తెచ్చి యిచ్చుచుండెను. చాచాను గౌరవించే వారు వానికేదో యిచ్చి వెళ్ళెడివారు. బాబా వెళ్ళినప్పుడల్లా వానికి అయిదు రూపాయలు యిచ్చెడివారు. అందువలన బాబా రాక వానికి చాలా సంతోషకారణముగా వుంటూ వుండేది. ఈ రోజు ఉదయం మాత్రం ఆ ముజావర్ తన పైగదిలో గాఢంగా నిద్రపోవుచుండెను. బాబా మనుష్యుల గొంతుకలు క్రిందనుంచి వినిపించే సరికి ఇదివరకు బాబా తనకు యిచ్చుచుండిన బహుమతులవలన కలిగిన ఆనందము జ్ఞాపకమునకువచ్చి వెంటనే లేచెను. త్వరగా క్రిందకు రావాలన్న ఆ తొందరతో పాపం ఆ నిద్దురబద్ధకంలో మెట్లమీదనుంచి వస్తున్న హడావిడిలో తలక్రిందులుగా వీధిలో పడెను. అయితే అతనికేమీ అపాయం కలుగలేదు. బాబా ఆయన అనుచరులు అతనిపాట్లు జూచి హాస్యపూరతముగా నవ్వుకొనిరి. వాని అయదు రూపాయిలు వానికి ముట్టినవి.

జూలై 1916లో బాబా మరల అజ్మీర్ వచ్చినప్పుడు చాచా ఎంత ఉల్లాసం ప్రదర్శించెనో కాకా చెప్పెను. బాబా ఒక చేతితో కప్పు-సాసరు ఇంకో చేతితో వేడి టీ ఉన్న కెటిల్ (జారీగిన్నె) పట్టుకొని, చాచా గదిలో ప్రవేశించిరి. చాచా మట్టుకు టీ నిరాకరించి తనకు మాంసము ఒక చపాతీ కావాలని చెప్పెను. చాచా పఠాను కులస్థుడు. పఠానులు మాంసం ఎక్కువగా భుజింతురు. బాబా అవి తెప్పించి అతనికి పెట్టెను. బాగా అవి యింకా కావలెనని ముమ్మారు అడిగి తెప్పించుకొనెను. అప్పుడు బాబా ఒకటిన్నర గంటలు చాచా వద్ద కూర్చుండెను. అంతసేపూ చాచా నవ్వు వినిపించుచూనే యుండెను.

రాత్రి భోజనం అయిన తరువాత పరుండుటకు పూర్వము ఉన్న ఆ మధ్య కాలమునందు బాబా యొక్క మండలివారు కూర్చుని సరదాగా ఆరోజున జరిగిన విశేషాలుగురించి ఇంకా ఏవయినా ఇతర సంగతుల గురించి మాట్లాడుకొనుటలో తరచుగా బాబా - ఆయన యొక్క మస్తు కార్యక్రమము గూర్చికూడా ఏవో చెప్పు కొనుచుందురు. ఆ సమయంలలో అందరూ సాధారణంగా అంగీకరించిన సంగతి 1940లో కలకత్తా నుంచి కరీంబాబాను బాబావద్దకు తీసుకొని వచ్చుటలో కాకా సాధించిన విజయముయొక్క ప్రాముఖ్యత. 1947 జూన్‌లో ఆజ్మీర్ నుంచి సతరాకు చాచాను వెంటబెట్టుకొని అంతదూరము రాగలిగిన బైదుల్ యొక్క అద్భుత





నిర్వాహకమున్నదే నిస్సందేహముగా అతనియొక్క కృషికి అది మకుటమువంటిది అని చెప్పవచ్చును.

చాచా వంటి మజ్జుబ్ యొక్క మూర్ఖత్వం మొండితనము- లేకపోతే దానిని హఠము అందాము- అది ఇటువంటిది అని చెప్పటకు బహుశా సాధ్యముకాదు. ప్రపంచంతో గాని, ప్రపంచమునందు అనేక వృత్తులలో పనినిచేసుకునే కష్టజీవులతో గాని అతనికేమీ సంబంధం ఉండదు. ముజ్జుబ్‌లు, మానవులంటే ఆధ్యాత్మికంగా ఒక విధమయిన తిరస్కారభావమో, లేక అప్పుడే జన్మించిన శిశువులకువలె, ఒక ఉపేక్షాభావము కలిగియుందురు. బాబా వంటి ఒక మహత్తరమైన ఆధ్యాత్మిక శక్తికే వారు లొంగి అప్పుడప్పుడు బాబా మండలివారి ప్రార్థన ప్రకారము చేయుచుందురు. ఇలాగే 1939లో ఎల్లిచ్‌పూర్‌నుంచి జబల్‌పూర్ ఆశ్రమమునకు కాకా తోడ్కొనివచ్చిన గులాబ్ బాబా చాలాముచ్చటైన వ్యక్తి. అతను బాబా తనను ఆకర్షించుచుండెనని తాను నిరోధించు చున్నను ఆ శక్తి బలవంతముగా అతని స్వభావమునకు విరుద్ధముగా బాబావద్దకు లాగినదని చెప్పుచుండును.

1947 మే మాసాంతమున బాబా ఆయన మండలి మహాబలేశ్వర్ నుండి సతారాకు వచ్చిరి. బాబా అక్కడికి రాగానే మస్తు ఆశ్రమమునకు ప్రణాళిక తయారు చేయబడినది. చాచాను సతారాకు తీసికొనివచ్చుటకు ప్రయత్నించమని బైదుల్ అజ్మీర్ పంపబడెను.

మే నెలాఖరుకు భారత దేశమునందు ప్రకృతి ఎటుజూచినను సూర్యుని వేడిమివలన ఎండిపోయినట్లగుపించుటయే గాక ఏపని చేయటకును వీలు కలుగదు. ఎండిన భూమి వర్షపు నీటికొరకు తహతహ పడుచుండును ఇంటువంటి నిస్సారమైన ప్రకృతిని దర్శంచుచూ ఆజ్మీరుకు ప్రయాణము చేయుచున్న బైదుల్ చాచా నివాస స్థలమును సమీపించుచుండగా అతని మనసులో ఆశ, సంశయము ఒక దానివెనుక ఒకటి వచ్చుచు పోవుచున్న సంగతి మనము ఊహించుకొనగలము, అతడు మే నెల కడపటివారములో ఆజ్మీరు చేరుకొనెను. అప్పుడు ఖ్వాజా సాహెబ్ వార్షికోత్సవము మ్ముమ్మరంగా జరుగుచున్నది. ఎండ సహించలేనంత వేడిగా నున్నది. చాలినంత నీరు దొరుకుటలేదు ఆ గొప్ప దర్గాకు యాత్రికులనేకులు తండోపతండములుగా వచ్చిరి.

మూడు నాలుగు రోజులు బైదుల్ చాచా వద్దకు తరచుగా వచ్చుచు పోవుచుండెను. కాని చాచాను తనతో రమ్మని ఎన్ని విధముల చెప్పి చూచినను అతని యత్నములు నిష్ఫలములయ్యెను. ఇంక లాభము లేదని నిశ్చయించుకొని చాలా క్రుంగిపోయి మే 31వ తేదీ సాయంకాలము మరల వెళ్ళెను. అప్పుడు మాంసముతోను పెరుగుతోను అన్నం తీసుకువచ్చి పెట్టవలసినదని చాచా అతనిని అడిగెను. బైదుల్ ఆ ప్రకారము చేయగా చాచా ఇంకా కావలెనని అడిగెను. ***(సశేషం)***

# సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్వీట్యూడ్

ప్రపంచం మొత్తంలో నెలకొన్న ఆర్ధిక మాంద్యం దృష్ట్యా, అవతార్ మెహెర్‌బాబా పర్పట్యువల్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్టు, అహమ్మద్‌నగర్‌కు అనేక పాశ్చాత్య దేశాలలో వున్న బాబా ప్రేమికుల నుండి వస్తున్న విరాళాలు భారీస్థాయిలో తగ్గిపోయాయన్న సంగతి పాఠకులందరికీ తెలుసు. ఈ లోటు పూరించేలాగా, మెహెరాబాద్‌లో చేపట్టే పలు బాబా కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగేందుకై తగిన విధంగా విరాళాలు పంపాలని బాబా ప్రేమికులందరికీ ట్రస్టు చైర్మన్, శ్రీ భావూకల్చూరీ విజప్తి చేశారు. ఈ విషయమై హైదరాబాదులోని బాబా ప్రేమికులు ఒక స్వచ్ఛంద సంస్థ- **"సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్వీట్యూడ్"ను** ఏర్పాటు చేసి, ఆ సంస్థను రిజిస్టర్ చేయించడమైంది. రిజిస్ట్రేషన్ నం. 430/09. తెలుగునాటగల ప్రతి బాబా సెంటర్‌నుండి వారి శక్త్యానుసారం ఎంతో కొంత నగదు విరాళాల రూపంలో, నెలకు కొంత మొత్తం చొప్పున, ప్రతినెలా సేకరించి, అలా సేకరంచిన మొత్తాన్ని ట్రస్టువారికి, వారి నిత్య కార్యకలాపాల నిర్వహణకోసం పంపాలన్నది ఈ సంస్థ ముఖ్యోద్దేశం అని సంస్థ అధ్యక్షులు, శ్రీ బి. రామకృష్ణయ్య, కార్యదర్శి, శ్రీ పి. రాజేంద్రమెహెర్, సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ భావూకల్చూరీ **స్వయంగా ఈ సంస్థ పేరును-"సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్వీట్యూడ్"** గా సూచించారని వారు తెలిపారు. అవతార్ మెహెర్‌బాబా ఆంధ్ర సెంటర్‌లోని సభ్యులందరూ ఈ సంస్థలో సభ్యులుగా వున్నారని శ్రీ రామకృష్ణయ్య తెలిపారు. ఆగష్టు నెలలో 50 వేల రూపాయలు వసూలుచేసి ట్రస్టువారికి పంపామని, సెప్టెంబరు నెలలో మరో రూ. 50 వేలు పంపనున్నామని అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, అనంతపురం తదితర బాబా సెంటర్లు తమ విరాళాలు అందజేశాయని తెలిపారు. సంస్థాపరంగా వుండే నిర్వహణా ఖర్చులన్నీ స్థానిక హైదరాబాదు బాబా సెంటరు భరిస్తుందన్నారు. ప్రేమికులు ఇచ్చే విరాళం మొత్తం నేరుగా ట్రస్టువారికి పంపవలెనని, ఎలాంటి ఖర్చు ఈ నగదునుండి వాడరాదని నిర్ణయించినట్లు శ్రీ రామక్రిష్ణయ్య తెలిపారు. ఈ సంస్థ ఎవరికీ మధ్యవర్తిత్వం వహించదంటూ, ఈ సంస్థ ఉద్ధేశ్యాలతో ఏకీభవించిన వారు మాత్రం ఈ సంస్థ ద్వారా ట్రస్టుకు ఎంతో కొంతమేర ప్రతినెలా విరాళాలు పంపాలని ఆయన కోరారు. కానిపక్షంలో, విరాళాలను నేరుగా ట్రస్టుకు ఎప్పటిలా పంపవచ్చని ఆయన అన్నారు. ఈ విషయంలో తమకు అందిన ప్రతి రూపాయికి సంస్థ తరఫున రశీదు ఇస్తామని, సంవత్సరాంతంలో ఆడిట్ చేయించి ప్రేమికులందరికీ జవాబుదారీగా వుంటామని అన్నారు. 2009 మే 17న జరిగిన అవతార్ మెహెర్‌బాబా ఆంధ్ర కేంద్రం కార్యవర్గ సమావేశంలో ఈ విషయాలన్నింటినీ కూలంకషంగా చర్చించి, సభ్యుల ఆమోదం పొందామన్నారు. కావున తెలుగునాట గల అన్ని అవతార్ మెహెర్‌బాబా కేంద్రాల వారు ఈ సంస్థ పనితీరులో స్వఛ్చందంగా పాల్గొని ప్రతినెలా ప్రేమ పూర్వకంగా తగిన విరాళాలు ఇతోధికంగా పంపి మెహెరాబాద్‌లో బాబా సమాధి చెంత చేపట్టే పలు కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సిందిగా శ్రీ రామకృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ❀





# జీవిత సభ్యత్వం

## 2009 ఆగస్టు - సెప్టెంబర్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఆగస్టు 09 | జి.ఎస్.జె.బి.బాబాజీ, పూనే | రు. 1000.00 |
| 2. | ఆగస్టు 09 | బి.హరిప్రసాద్ | రు. 500.00 |
| 3. | సెప్టెంబర్ 09 | సి.హెచ్. సత్యవతి, కాకినాడ | రు. 1000.00 |
| 4. | సెప్టెంబర్ 09 | సెక్రటరి, అవతార్ మెహెర్‌బాబా ఆంధ్ర రెస్ట్‌హౌజ్, మెహెరాబాద్ | రు. 1000.00 |
| 5. | సెప్టెంబర్ 09 | వి.ఆర్.కె. శాస్త్రి, హైదరాబాద్ | రు. 1000.00 |
| 6. | సెప్టెంబర్ 09 | ఐ. రామా గౌడ్, మెదక్ | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు. 5,000.00** |

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ. 500/- చొప్పున చెల్లించవచ్చు.
3. వార్షిక సభ్యత్వం రూ. 100/-
4. మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు

**మా అడ్రస్:** **ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
**యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500 087, ఫోన్: 99595-53218.**

# పత్రిక సకాలంలో

**మెహెర్‌బాబా మాసపత్రిక మీకు సకాలంలో రాకుంటే దయచేసి శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- 94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.